సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18.1.2026

ఆదివారం అనుబంధం



# వెనిజులాపై
# అమెరికా జులుం

సూర్య
www.suryaa.com
18.1.2026
ఆదివారం అనుబంధం

# చైర్మన్‌తో ముఖాముఖి

**పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో నిర్ణయం తీసుకోకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసి, రెండు వారాల్లోగా తేల్చకపోతే మేమే నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించిందన్న వార్తలు వస్తున్నాయి. ఏడుగురు ఎమ్మెల్యేల పిటిషన్లపై చర్యలు తీసుకున్నా, మిగతా వారిపై ఇంకా నిర్ణయం రాకపోవడంతో కోర్టు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇది చివరి అవకాశమని . లేదంటే తామె నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని సుప్రీంకోర్టు స్పీకర్‌ని ఆదేశించడం పై మీ స్పందన ఏంటి?**

**– ఎం. శ్రీధర్ బాబు, హైదరాబాద్**

అవును శ్రీధర్ గారు తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు తగిన సమయం ఇచ్చినా ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా.. లేదంటే తామే నిర్ణయం తీసుకోవాలా అని కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చిన సుప్రీంకోర్టు.. రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. రెండు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ తీసుకున్న చర్యల అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది.. ఇప్పటివరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీసుకున్న చర్యలను కోర్టుకు విన్నవించారు. మిగతా వారిపై నిర్ణయం తీసుకోకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో మిగతా వారిపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేసేందుకు 4 వారాల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని, ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది. ఇంకా ఆలస్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. స్పీకర్ రెండు వార్లాగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది.

అందులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, పురోగతిని వివరించాలని సూచించింది. రెండు వారాల తర్వాత తదుపరి విచారణ జరగనుంది. మిగిలిన కేసుల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తే, అదనపు సమయం గురించి తర్వాత ఆలోచిస్తామని సుప్రీంకోర్టు బదులిచ్చింది.


పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, సంజయ్‌లపై అనర్హత పిటిషన్లపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఇతర కేసుల్లో, పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేకపోవడంతో స్పీకర్ వారి పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాలలోని లోపాలను ఈ దశలో తాము పరిశీలించలేమని కోర్టు స్పష్టం చేసింది.

**పశ్చిమ బెంగాల్ రాజకీయ వేదికపై దీదీ వర్సెస్ సువేందు పోరు క్లైమాక్స్ దశకు చేరుకుందనిపిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు చెప్పండి సార్...**

**– జి. సంధ్యారాణి, విశాఖపట్నం**

మీరు చెప్పింది నిజమే సంధ్యగారూ... తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ.. తన పరువుకు భంగం వాటిల్లేలా చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఏకంగా రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేశారు. బొగ్గు కుంభకోణంతో తనకు సంబంధం ఉందని, అందుకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని మమత చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించాయి. అయితే ఆ ఆధారాలను 72 గంటల్లోగా బయటపెట్టాలని సువేందు విసిరిన సవాల్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో.. ఆయన నేరుగా అలీపూర్ కోర్టు గడప తొక్కారు. తన ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. కోల్‌కతాలోని అలీపూర్ కోర్టులో శుక్రవారం ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదం జనవరి 8, 9 తేదీలలో మమతా బెనర్జీ చేసిన బహిరంగ ప్రసంగాలతో మొదలైంది. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నిధులు సువేందు అధికారి ద్వారా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు చేరుతున్నాయని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని మమత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన సువేందు.. తన న్యాయవాది ద్వారా వెంటనే మమతకు నోటీసులు పంపారు. 72 గంటల్లోగా ఆ ఆరోపణలను నిరూపించాలని, లేదంటే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.నోటీసులకు నిర్ణీత సమయంలోగా మమతా బెనర్జీ నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో సువేందు అధికారి న్యాయ పోరాటానికి దిగారు. “నేను ఇచ్చిన మాట మీద నిలబడతాను. మీరు చేసిన కట్టుకథలు, నిరాధారమైన ఆరోపణల విషయంలో మిమ్మల్ని కోర్టుకు ఈడ్చుతానని ముందే చెప్పాను. అదే చేశాను” అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా మమతపై విరుచుకు పడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఆధారాలు లేకుండా మాట్లాడటం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

ఈ కేసులో ఒకవేళ కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చి, పరిహారం చెల్లించాలని ఆదేశిస్తే.. ఆ రూ. 100 కోట్ల సొమ్మును తాను సొంతానికి వాడుకోకుండా పూర్తిగా సేవా కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని సువేందు ప్రకటించారు. టీఎంసీ ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే తనపై ఇలాంటి వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో మమతా బెనర్జీ మంత్రి వర్గంలో కీలక నేతగా ఉన్న సువేందు అధికారి.. 2021 అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీలో చేరినప్పటి నుంచి ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం సాగుతోంది. నందిగ్రామ్ ఎన్నికల్లో మమతను ఓడించిన సువేందు.. ఇప్పుడు కోర్టులో ఆమెను ఎలా ఎదు-ర్కోబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.



**నూకారపు సూర్య ప్రకాశరావు**
**చైర్మన్, సూర్య తెలుగుదినపత్రిక**

# వైకల్యాన్ని జయించి ఉన్నత పదవులందుకున్న జైపాల్ రెడ్డి

## లెజెండ్



18 నెలల వయసులో ఉండగానే పోలియో కారణంగా వైకల్యానికి గురయ్యారు. కానీ, అది ఆయన రాజకీయ జీవన ఆరోహణకు ఎన్నడూ అవరోధం కాలేకపోయింది.పలు మార్లు కేంద్ర మంత్రిగా, ఐదు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేసి సుదీర్ఘ రాజకీయ అనుభవం గడించి పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన తెలుగు రాజకీయవేత్త జైపాల్ రెడ్డి గారి జయంతి జ్ఞాపకం !

సూదిని జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942 జనవరి 16న జన్మించారు. నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం సాగించిన జైపాల్ రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లీష్ పట్టా తీసుకున్నారు. ఉస్మానియాలో విద్యార్థి నాయకుడిగా ఉండగానే జైపాల్ రెడ్డి రాజకీయ జీవితం మొదలైంది.....

కాంగ్రెస్ పార్టీలో చేరి, 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. ఆ తర్వాత మరో మూడు సార్లు కూడా ఇదే నియోజకవర్గానికి ఆయన ఎమ్మెల్యేగా పనిచేశారు. 1975లో ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ జైపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. జనతా పార్టీలో చేరి, 1980లో ఇందిరా గాంధీపై మెదక్ ఎంపీ స్థానంలో పోటీకి దిగారు. అయితే, ఆయనకు విజయం దక్కలేదు.

1984లో జైపాల్ రెడ్డికి పార్లమెంటులో సభ్యుడిగా అడుగుపెట్టే అవకాశం తొలిసారి వచ్చింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఆయన గెలిచారు. 1985 నుంచి 1988 వరకు జైపాల్ రెడ్డి జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన జనతా దళ్‌లో చేరారు.

1990, 1996లో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. 1991 నుంచి 1992 వరకూ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 1998లో జనతాదళ్ (సెక్యులర్) తరఫున మహబూబ్ నగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికయ్యారు. 1998లో అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం కూడా ఆయన అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీ ఆయనే.

**మళ్లీ కాంగ్రెస్‌లోకి..** 1999లో జైపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. వరుసగా 1999, 2004ల్లో ఆ పార్టీ తరఫున మిర్యాలగూడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2000 వరకు సభాహక్కుల ఉల్లంఘన కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. 2009లో చేవెళ్ల ఎంఎ ఓగా జైపాల్ రెడ్డి గెలుపొందారు.జైపాల్ రెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రిగానూ పనిచేశారు.ఐకే గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో, ఆ తర్వాత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల్లో జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రి పదవులు చేపట్టారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహా మరి కొన్ని శాఖలకు మంత్రిగా పనిచేశారు. .జైపాల్ రెడ్డికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

**రాజకీయ వక్తగా చెరగని ముద్ర...** భారత రాజకీయాల్లో అధ్యయనం, అవగాహన, వాక్పటిమల మేళవింపుగా రాణించిన అరుదైన రాజకీయవేత్త జైపాల్ రెడ్డి అని సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ కృష్ణారావు అన్నారు. గాంధేయవాద పరంపరకు, సోషలిస్ట్ భావజాలానికి ఆయన దాదాపు చివరి ప్రతినిధి అనుకోవచ్చని చెప్పిన కృష్ణారావు, “సాహిత్యాన్ని, తత్వశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేసి ఆ పునాదుల మీద రాజకీయవాదాన్ని నిర్మించుకున్న రాజకీయ నాయకుడు జైపాల్ రెడ్డి. అరిస్టాటిల్ నుంచి మార్క్స్ దాకా ఆయన దేని గురించైనా మాట్లాడేవారు. యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ ఆయనే రూపొందించారు. భారతదేశ ప్రాధాన్యాల గురించిన ఆయన అవగాహన ఎలాంటిదో తెలుసుకోవడానికి ఆ డాక్యుమెంట్ ఒక్కటి చాలు” అని చెప్పారు. ఆ స్థాయి కలిగిన నేతలు ఇప్పుడు ఎవరున్నారో వెతకడం కూడా కష్టమేనని ఆయన అన్నారు.జైపాల్ రెడ్డితో సన్నిహితంగా ఉన్న మరో సీనియర్ జర్నలిస్ట్ జింకా నాగరాజు కూడా, “ఆయన రాజకీయ తత్వవేత్త లేదంటే తాత్విక రాజకీయవేత్త” అని వ్యాఖ్యానించారు.

“పార్లమెంటులో ఆయన చేసిన ప్రసంగాలు గమనిస్తే, ఆయన ఏ అంశాన్నీ ఉపరితలంగా, ఆరోపణలే ప్రధానంగా చేసుకుని మాట్లాడరని తెలిసిపోతుంది. ప్రతి సమస్యకున్న తాత్విక పునాదులను అర్థం చేసుకుని లోతైన అవగాహనతో మాట్లాడడం ఆయన నైజం. అందుకే, ఆయన స్వరం వినిపిస్తే పార్లమెంటు నిశ్శబ్దంగా చెవులు రిక్కించేంది. లౌకిక స్ఫూర్తికి ఆయన నిఖార్సయిన నిదర్శనం. ఒక ఇంద్రజిత్ గుప్తా, ఒక జైపాల్ రెడ్డి.... ఇలా ఉత్తమ పార్లమెంటేరియన్లు ఒకరొకరే వెళ్ళిపోతుండడం బాధ కలిగిస్తోంది” నాగరాజు ఆయన వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు.

**యువతకు ఆదర్శం:** పోలియో బారిన పడ్డా, మొక్కవోని దీక్షతో పనిచేసి జైపాల్ రెడ్డి రాజకీయాల్లో ఉన్నత స్థానానికి చేరారని, ఆయన జీవితం యువతకు ఆదర్శమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జైపాల్ రెడ్డితో తనకు ఎంతో అనుబంధం ఉందని వెంకయ్యనాయుడు అందులో పేర్కొన్నారు......

“నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్ళలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మా ఇద్దరిదీ ప్రత్యేకమైన పాత్ర. వ్యక్తి కన్నా ప్రజాస్వామ్య వ్యవస్థకు వారు అధిక ప్రాధాన్యతనిచ్చే వారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా జైపాల్ రెడ్డి ప్రతి అడుగు ప్రజల కోసమే ముందుకు సాగింది” అని వెంకయ్యనాయుడు అన్నారు.


“జైపాల్ రెడ్డి మంచి వక్త. అపారమైన మేధస్సుతో పాటు అందరినీ ఆకట్టుకునే విశ్లేషణలు ఆయన సొంతం. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆయనుకున్న ప్రావీణ్యం అమోఘమైంది. వారి వ్యక్తిత్వం, ప్రజా సమస్యలను చూసే కోణం, మాట్లాడే విధానం మా ఇద్దరినీ మంచి మిత్రులుగా మార్చింది” అని వివరించారు

ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జైపాల్ రెడ్డి గారి తమ్ముడి కూతురు గీతా రెడ్డిని ప్రేమించి, పెద్దలను ఒప్పించి 1992లో వివాహం చేసుకున్నారు.

జైపాల్ రెడ్డి గారు హైదరాబాదు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో చికిత్స పొందుతూ 2019, జూలై 28 తెల్లవారుజామున గం. 1.28 ని.లకు మరణించారు.

సూర్య
www.suryaa.com
ఆదివారం అనుబంధం
18.1.2026

పాఠకుల లేఖలు




## ముఖచిత్ర కథనం

యువజనోత్సవాల పై ఈ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన వ్యాసం చాలా బాగుంది. యువత స్ఫూర్తిగా వివేకానందుడి గురించి మాకు తెలియని విశేషాలు గురించి తెలియజేసిన రచయితకు ధన్యవాదాలు ,సందర్భానుసారంగా మీ కథనాలు బాగున్నాయి. ఇదే పంథా కొనసాగించండి.

**– ఎలకల రవికుమార్, విశాఖపట్నం**
**రావు పల్లి రమేష్, విజయనగరం**
**మీసాల భారతీ, శృంగవరపు కోట**
**చిత్తరంజన్ దాస్ వెలగపూడి, విశాఖపట్నం**

## సినిమా రివ్యూలు

వారం వారం విడుదలవుతున్న సినిమాలపై మీ విశ్లేషణ బాగుంది. ధన్యవాదాలు. ఓటిటి సినిమాలపై కూడా విశ్లేషణ చేయటం హర్షణీయం.

**–కస్తూరి శివరావు, విజయవాడ**
**–చినవీరభద్రుడు కణపాక, హైదరాబాద్**

## బుడత బాగున్నాడు

చిన్నారి ప్రపంచంలా ప్రచురిత మవుతున్న బుడత పేజీలో చిన్నారులకు వుపయుక్తంగా రచయితలు రాస్తున్న కథలు బాగున్నాయి. అలాగే పజిల్స్ విజ్ఞాన వంతంగా ఉన్నాయి. తెలుగువారి శతకాలు, పద్యాలు అప్పుడప్పుడు మిస్ అవుతున్నాం. తప్పక ప్రచురించండి

**–కోరుట్ల రమాదేవి, తెనాలి**
**–మక్కామల పద్మావతి, హైదరాబాద్**

నవకవిత్వం

## "మనుషులు కొందరు"



మనుషులు ఇలాగే ఉంటారనుకునేవాణ్ణి చిన్నప్పుడు.
అలాగైతే మనుషులు
ఇంకా మృదువైన పుష్పాల్లాగో,
మెత్తని దూదిపింజ లాంటి మనస్సుగల వాళ్ళ
లాగో,
మాటల కుతూహలంతో సంతృప్తినిచ్చే వాళ్ళలాగో,
నవ్వుతూ ఆరోగ్యంగానో.
మనుషులు అలాగే ఉంటారనుకునేవాణ్ణి.
కానీ,
నిశ్చలంగా, జీవచ్ఛవాల్లా,
ధనవిహీనంగా,
పీడితులుగా.
అప్పుడప్పుడూ మాటల పిడికిలి బిగించే
నిస్సహాయులుగా ఉంటారు కూడా.
వారాంతపు చిరు సంతోషాలూ,
రోజూవారి భ్రమలూ,
చిందరవందర దుఃఖాలూ.
పొడవాటిరోజుల్నలా వెళ్లదీస్తూ పోతారు.
అయినా
కొందరు మనుషులు
చలిమంటలాంటి వాళ్ళు,
మరి కొందరు చలివేంద్రం లాంటి వాళ్ళు.

**లేదాళ్ళ రాజేశ్వర రావు, 9441873602**

## భలే భలే పండుగ



భలే భలే పండుగ భోగిమంటల పండుగ
బాలలంత ముందుగా కదలిరండి దండిగ
భలే భలే పండుగ భోగిమంటల పండుగ
బాలలంత ముందుగా కదలిరండి దండిగ
చలిపులినే తరిమేద్దాం వడివడిగా రండి
కలివిడిగా కలిసుందాం వేగిరమే రారండి
ఎండిన తాటాకులనే త్వర త్వరగా తేండి
భోగిమంటలు వేసేసి భోగభాగ్యాల తేలండి
తంపటిలో తేగలేసి వేడి నీళ్లు కాయండి
తెల్లారకముందే ఇంటి లోగిలి ఊడ్చండి
ఆవుపేడతోటి అందంగా కళ్ళాపి చల్లండి
ముత్యాల ముగ్గులతో ముంగిళ్ళు దిద్దండి
తలంటి స్నానంచేసి చలిపులినే తరమండి
కొత్తబట్టలు ధరించి ఇష్టదైవం కొలవండి
తంపటివేసిన తేగలనే తనివితీరా తినండి
పసందైన పిండివంటల్నే ఓ పట్టు పట్టండి
ఆడపడుచుల్ని ఎన్నడూ వీడబోకండి
ఇంటిఅల్లుళ్ల నేనాడు మరువ బోకండి
రేగుపళ్లు పిల్లల శిరస్సుపై పోయండి
సుఖ సంతోషాల విలసిల్లమని దీవించండి

**గుండాల నరేంద్ర బాబు, :9493235992**

# మహాభారతం - పాత్రలు

**కె.హేమచందర్ - 94400 21108**

**(గత వారం తరువాయి)**

**పురూరువుడు :** మను పుత్రిక ఇల, చంద్రుడి పుత్రుడు బుధుడికి జన్మించినవాడు. మహాచక్రవర్తి. అధికార మదంతో బ్రాహ్మణోత్తముల ధనాన్ని అపహరించాడు. ఈ విషయం తెలిసి సనత్‌కుమారుడిని దేవతలను బ్రహ్మ పంపించాడు. దేవలోకం నుంచి వచ్చిన వారికి పురూరవుడు దర్శనానికి అనుమతించకపోగా హేళన చేసాడు. దీంతో ఆగ్రహించినవారు, పురూరవుడు వెర్రివాడవ్వాలని శపించారు. అప్సరస ఊర్వశి, పురూరువుల కుమారులు ఆయువు, ధీమంతుడు, అమావసువు, దృఢాయువు, వనాయువు, శతాయువు.

**నహుషుడు :** ఊర్వశి, పురూరువుల కుమారుడు ఆయువు. ఆయువు, సర్భావని అనే దంపతుల కుమారుడు నహుషుడు. అంటే పురూరవుడి మనవడు నహుషుడు. వృద్ధశర్మ, రజి, గయుడు, అనేనసుడు సోదరులు. నహుషుడి భార్య ప్రియంవద. నూరు యజ్ఞాలు చేశాడు.

**యయాతి :** నహుషుడు, ప్రియంవదల కుమారుడు. దానవుల గురువైన శుక్రుడు కుమార్తె దేవయాని, రాక్షస రాజైన వృషపర్వుడి కుమార్తె శర్మిష్టను వివాహమాడాడు. దేవయానికి యదువు, తుర్వసుడు, శర్మిష్టతో ద్రుహ్యు, అనువు, పూరుడనే కుమారులు జన్మించారు. శుక్రుడి శాపంతో ముసలివాడయ్యాడు. వృద్ధాప్యాన్ని తీసుకుని యవ్వనాన్ని తనకు ఇవ్వమని అడిగితే, పూరుడు మినహా మిగిలినవారు నిరాకరించారు.

**దేవయాని :** దేవేంద్రుడి కుమార్తె జయంతి గర్భంలో శుక్రుడికి కలిగిన కూతురుగా బ్రహ్మపురాణంలో ఉంది. దానవ రాజైన వృషపర్వుడి కుమార్తె శర్మిష్టతో కలిసి ఒక నాడు సరస్సుకు వెళ్లినపుడు, గాలికి వస్త్రాలు చెల్లాచెదురయ్యాయి. దేవయాని చీరను శర్మిష్ట కట్టుకోగా, ఆమె చీర కట్టుకోవడానికి శుక్రపుత్రిక నిరాకరించింది. ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదంలో వస్త్రాలు ధరించకుండా ఉన్న గురుపుత్రికను బావిలో పడేసి శర్మిష్ట చెలికత్తెలతో వెళ్లిపోయింది. అడవిలో



దస్సిపోయిన యయాతి తాగునీటి కోసం బావిలోకి తొంగి చూసాడు. ఆమె వివరాలు తెలుసుకున్నాడు. బావిలో తీగను పట్టుకుని వేలాడుతున్న ఆమెను చూసి చేయి అందించి పైకి తెచ్చి వెళ్లిపోయాడు. తర్వాత అక్కడికి వచ్చిన దేవయాని చెలికత్తె ఘూర్ణికతో జరిగినది చెప్పి, తాను వృషపర్వుడి రాజ్యంలో అడుగు పెట్టనని తన తండ్రికి చెప్పమని పంపింది. విషయం తెలుసుకున్న శుక్రాచార్యుడు పరుగుపరుగున వచ్చి కూతురిని సముదాయించి రాజ్యానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా దేవయాని అంగీకరించలేదు. కూతురు రాకుండా రాజ్యానికి వెళ్లేందుకు శుక్రుడు నిరాకరించాడన్న విషయం చారుల ద్వారా తెలుసుకున్న వృషపర్వుడు వచ్చి గురువు పాదాలపై బతిమాలాడు. దేవయాని కోరినట్లు వెయ్యి మంది చెలికత్తెలతో సహా శర్మిష్టను ఆమెకు దాసిగా సమర్పించాడు. దేవయాని, శర్మిష్ట, చెలికత్తెలు ఒకనాడు ఆడుతుండగా ఆమెను యయాతి చూసి వివాహమాడతాడు..

**శర్మిష్ట :** రాక్షస రాజైన వృషపర్వుడి కుమార్తె. దానవ గురువు శుక్రాచార్యుడు కుమార్తె దేవయాని స్నేహితురాలు. వెయ్యి మంది చెలికత్తెలతో కలిసి వారు సరస్సుకు వెళ్లారు. వారు వస్త్రాలు ఒడ్డున ఉంచి స్నానం చేస్తుండగా గాలి రావడంతో వస్త్రాలన్నీ కలిసిపోయాయి. దేవయాని చీర శర్మిష్ట కట్టుకోగా, రాకుమారి చీర కట్టుకోవడానికి గురుపుత్రిక నిరాకరించింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దేవయానిని బావిలో పడేసి శర్మిష్ట చెలికత్తెలతో వెళ్లిపోయింది.

**దుష్యంతుడు :** పూరు వంశానికి చెందిన ఇలినుడు, రథంతరి కుమారుడు (ఆదిపర్వం చతుర్థాశ్వాసం). మహాయోధుడు. కణ్వాశ్రమంలోని శకుంతలను చూసి మోహించాడు. గాంధర్వ వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత రాజ్యానికి వెళ్లిపోయాడు. ఆమెకు భరతుడు జన్మించాడు. బిడ్డతో రాజ్యానికి వచ్చిన ఆమెను చూసి 'ఏ నెఱుగ నిన్ను; నెక్కడి ၊ దానవు? మిన్నకయ యనుచితంబులు పలుకంగానేల?' అంటూ తిరస్కరించాడు. చివరకు ఆకాశవాణి ప్రకటనతో ఆమెను తన ధర్మపత్నిగా ప్రకటించాడు. తర్వాత కాలంలో కుమారుడికి రాజ్యభారం అప్పగించి తపోవనానికి వెళ్లాడు.

**కుంతి :** యాదవ రాజు శూరసేనుడి పెద్దకుమార్తె. పృథ ఆమె పేరు. వసుదేవుడి సోదరి. తల్లి మారిష. శూరుడి మేనత్త కొడుకు కుంతిభోజుడు. పృథను దత్తత తీసుకున్నాడు. కుంతిభోజుడు కుమార్తె కావడంతో కుంతి అని పిలిచేవారు. కుంతి భోజుడి ఇంట బస చేసిన దుర్వాస మహర్షికి పృథ చేసిన సేవలకు మెచ్చి మహామంత్రం ఉపదేశించాడు. ఆ మంత్రం పఠించి ఏ దేవుడిని ఆహ్వానిస్తే ఆ దేవుడి వచ్చి కోరిన కొడుకును ప్రసాదిస్తాడు. బాల్యచాపల్యంతో మంత్ర ప్రభావాన్ని పరిశీలించాలని సూర్యదేవుడిని పిలిచి, కర్ణుడిని పొందింది. పాండురాజు భర్త. భార్యతో సంగమిస్తే మరణం సంభవిస్తుందన్న ముని కిందముడి శాపంతో పాండురాజు సంతానవిహీనుడయ్యాడు. కుంతికి ఉన్న వరప్రభావంతో ధర్మరాజు, భీముడు, అర్జునుడిని పొందింది. అదే మంత్రాన్ని సవతి మాద్రికి చెప్పి, నకుల సహదేవుల జననానికి కారణమైంది. భర్త మరణానంతరం పలు కష్టాలు పడినా, ఏనాడు ఎవ్వరినీ పల్లెత్తు మాట అనలేదు. లక్కగృహ దహనానంతరం పిల్లలతో కలిసి సౌఖ్యానికి దూరంగా ఉంది. కురుక్షేత్ర యుద్ధానంతరం ధృతరాష్ట్ర, గాంధారీలతో కలిసి వనవాసానికి వెళ్లింది.

**గాంధారి :** గాంధార దేశాన్ని పాలించే సుబలుడి కుమార్తె. గాంధారికి వంద మంది సంతాన యోగం ఉందని తెలుసుకున్న భీష్ముడు, ఆమెతో ధృతరాష్ట్రుడికి వివాహం చేసాడు. గాంధారితో పాటు ఆమె తోబుట్టువులు పదిమందికి కూడా ధృతరాష్ట్రుడితోనే పెళ్లి జరిగింది.
(మిగతా తరువాయి సంచికలో)

**(మిగతా తరువాయి సంచికలో)**

సూర్య
www.suryaa.com
ఆదివారం అనుబంధం
18.1.2026

# బుడత



## బాలల కథ

### తేలుకొండిగాళ్ళు

**– పల్లా వెంకట రామారావు, 9949043019**



ఒక అడవిలో ఒక సాధువు తన శిష్యునితో కలిసి ఉండేవాడు. అడవి నుంచి పండ్లు, కాయలు, దుంపలు సేకరించి ఆహారంగా స్వీకరించేవారు.అవి దొరకని కాలంలో సమీపంలో ఉన్న గ్రామం నుంచి భిక్ష స్వీకరించేవారు.

ఒకరోజు గ్రామం నుంచి సాధువుకు పిలుపు వచ్చింది. భైరవుడు అనే వ్యక్తి ఏదో జబ్బుతో బాధపడుతున్నాడు. వాని కుటుంబ సభ్యులు వచ్చి భైరవుడిని రక్షించమని సాధువును అర్థించారు. సాధువుకు వైద్యం తెలుసు. అడవిలో లభించే మూలికలను ఉపయోగించి చాలామందికి జబ్బులు నయం చేశాడు.

సాధువు భైరవుని ఇంటికి వచ్చి అతనికి వైద్యం చేశాడు. కొద్ది రోజులకు భైరవుడు కోలుకున్నాడు. అతడు సాధువుతో మాట్లాడుతూ తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని వాపోయాడు. అప్పుడు సాధువు అతడి నేపథ్యాన్ని పరిశీలించి భైరవుడు ఏం చేస్తే అభివృద్ధి చెందుతాడో ఆ పనులు చేయమని సూచించాడు.

భైరవుడు సాధువు చెప్పినట్లే నడుచుకుని అనతి కాలంలోనే బాగా ధనం సంపాదించి అభివృద్ధి చెందాడు. అతని స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. అలా కొంతకాలం గడిచిపోయింది.


ఒకరోజు శిష్యుడు ఏదో పని పైన గ్రామానికి వచ్చాడు. కొంతమందిని కలిసి, తిరిగి ఆశ్రమానికి చేరుకున్నాడు. శిష్యుడి వాలకం చూసిన సాధువు "ఏమైంది?" అని అడిగాడు. శిష్యుడు బాధపడుతూ "స్వామీ!తమరు కొన్నేళ్ల కిందట భైరవుడు అనే వ్యక్తికి వైద్యం చేసి అతని ప్రాణాలు కాపాడారు గుర్తుందా?" అని అడిగాడు.

లేకేం గుర్తుంది" అన్నాడు సాధువు. "అంతేగాక అతని ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడానికి మీ సలహాలు కూడా ఉపయోగపడ్డాయి అవునా?" అని అడిగాడు శిష్యుడు. "అవును. అయితే ఇప్పుడు ఏమిటి?" అడిగాడు సాధువు.

"ఆ భైరవుడు మీ గురించి, మన ఆశ్రమం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని కొంతమంది నాకు చెప్పారు. ఇదేమిటి గురుదేవా! మన వల్ల సహాయం పొందిన వారే మనకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయడం ఏమిటి? వీరిని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ మాటలు విన్నప్పుడు నాకు చాలా బాధేసింది" అన్నాడు శిష్యుడు.

దానికి సాధువు పకపక నవ్వుతూ "లోకం తీరు అంతే నాయనా! సాయం చేసే వారిని వెన్నుపోటు పొడిచే వారు కొందరు ఉంటారు. ఇలాంటి వారిని తేలుకొండిగాళ్లు అంటారు. నీకు ఒక కథ తెలుసు కదా! వెనుకటికి ఒక సాధువు నీటిలో పడిన తేలును రక్షిద్దామని బయటికి తీస్తే అది అతన్నే కుడుతుంది. ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా అది కుడుతూనే ఉంటుంది. వీరు కూడా అలాంటి వారే. ఇది మనుషుల్లో మాత్రమే కనిపిస్తుంది. ఒకరి వల్ల సహాయం పొందితే కృతజ్ఞతగా ఉండాలి కానీ కొందరు మనుషులు అవతలి వారి నుంచి సహాయం పొందినందువల్ల వారి కంటే తాము తక్కువ అనే న్యూనతా భావంలో ఉంటారు. దాన్నుంచి తప్పించుకోవడానికి ఇలా అవతలి వారిని తక్కువ చేసి మాట్లాడుతూ ఉంటారు. మన జీవితంలో ఇది కూడా ఒక భాగం అనుకుని అలాంటి వారితో మనం జాగ్రత్తగా ఉండడం తప్ప ఏమి చేయలేం" అన్నాడు సాధువు.

అర్థమైనట్టు తలాడించాడు శిష్యుడు.






FIND 10 DIFFERENCES

## SUDOKU for kids

| | | | |
|---|---|---|---|
| | 4 | | |
| 2 | | 4 | 1 |
| 3 | 2 | | 4 |
| | | 3 | |

| | | | |
|---|---|---|---|
| 1 | | | 3 |
| 2 | | 1 | |
| | | 3 | |
| 3 | 2 | | 1 |

| | | | |
|---|---|---|---|
| | 4 | 1 | |
| 2 | | | 3 |
| | 3 | 2 | |
| | 2 | 3 | |

| | | | |
|---|---|---|---|
| | | 3 | |
| 1 | 3 | | 4 |
| | 2 | 1 | |
| 3 | | 4 | |

| | | | |
|---|---|---|---|
| 3 | 4 | | 2 |
| | | | 3 |
| 1 | | | 4 |
| 4 | | 3 | |


| | | | |
|---|---|---|---|
| 3 | | | 1 |
| | 1 | | 3 |
| 2 | | 1 | |
| | 4 | 3 | |

| | | | |
|---|---|---|---|
| 1 | | 3 | |
| | 3 | 2 | |
| 2 | | | 3 |
| 3 | | 4 | |

| | | | |
|---|---|---|---|
| | | | 3 |
| 1 | 3 | | 2 |
| 2 | | 3 | 1 |
| 3 | | | |

| | | | |
|---|---|---|---|
| 1 | | | 4 |
| 2 | | 1 | |
| 4 | | 3 | |
| | 2 | 4 | |

| | | | |
|---|---|---|---|
| 1 | | 4 | |
| 4 | | | 2 |
| 3 | 4 | | |
| | | 3 | 4 |



ఆదివారం అనుబంధం
సూర్య www.suryaa.com
18.1.2026

# నిద్ర కోల్పోతున్న విద్యార్థులు - జారిపోతున్న భవిష్యత్



ఒక ఉదయం మనల్ని ఉత్సాహంగా లేపుతుంది. మరో ఉదయం పూర్తిగా నిర్వీర్యంగా మారుస్తుంది. నేటి విద్యార్థుల జీవితాల్లో రాత్రి అంటే విశ్రాంతి కాదు, ఒత్తిడి. ఎసైన్‌మెంట్లు, పరీక్షల భయం, స్క్రీన్‌లకు అతుక్కుపోయిన మనసూ ఇవన్నీ కలిసి నిద్రను దూరం చేస్తున్నాయి. దాని ప్రభావం ఉదయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం అలసట కాదు. ఇది ఒక మానసిక జీవశాస్త్రీయ హెచ్చరిక.

**విద్యార్థుల్లో కనిపిస్తున్న 'మార్నింగ్ సిక్నెస్ణ :** ఇటీవల కాలంలో విద్యార్థుల్లో ఉదయం లేవడంపై విపరీతమైన నిరాసక్తత కనిపిస్తోంది. తరగతుల్లో చురుకుదనం తగ్గుతోంది. జ్ఞాపకశక్తి మందగిస్తోంది. చదవాలన్న ఆసక్తి తగ్గిపోతోంది. దీనిని చాలామంది 'మార్నింగ్ సిక్నెస్ణగా తేలిగ్గా తీసుకుంటున్నారు. కానీ వైద్యులు, మానసిక నిపుణులు ఇది డిలేడ్ స్లీప్ ఫేజ్ సిండ్రోమ్గా చెబుతున్నారు. ఈ స్థితిలో శరీర జీవగడియారం (సర్కేడియన్ రిథమ్) అస్తవ్యస్తమవుతుంది. ఫలితంగా మెదడు ఎప్పుడు పనిచేయాలో, ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో గందరగోళానికి గురవుతుంది.

**స్కూల్--కాలేజీ ఒత్తిడి: కనిపించని భారము :** తీవ్రమైన పోటీ, అధిక పాఠ్యభారం, ఎసైన్‌మెంట్ల ఒత్తిడీ ఇవన్నీ విద్యార్థులపై నిరంతర మానసిక భారంగా మారాయి. ఆడుకునే సమయం తగ్గిపోయింది. విశ్రాంతికి చోటు లేకుండా పోయింది. రాత్రి ఎప్పుడు నిద్రపోతామో, ఉదయం ఎప్పుడు లేస్తామో తెలియని పరిస్థితి పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**నిద్రలేమి వల్ల**: జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది భావోద్వేగాల నియంత్రణ తప్పుతుంది చిరాకు, ఆందోళన పెరుగుతాయి డిప్రెషన్ ప్రమాదం అధికమవుతుంది ఇవి అన్నీ చదువుపై నేరుగా ప్రభావం చూపే అంశాలే.స్క్రీన్‌ల మాయలో చిక్కుకున్న మనసురాత్రి వరకు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఫ్రెండ్స్‌తో చాటింగ్ ఇవన్నీ మెదడును నిరంతరం ఉద్దీపనకు గురిచేస్తున్నాయి. ఫలితంగా పడుకున్నా నిద్ర పట్టడం లేదు. ఆలోచనలు ఆగడం లేదు. భవిష్యత్తుపై భయం, స్వీయ విమర్శ మొదలవుతున్నాయి. ఇది నిద్రకు ముందు జరిగే మానసిక ఓవర్‌లోడ్. దీని ప్రభావం నిద్రపైనే కాదు, మరుసటి రోజు మనస్థితిపైనా పడుతోంది.

**కేస్ స్టడీ: :** సంతోష్ 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి. రోజూ అర్ధరాత్రి 1--2 గంటల వరకు ఎసైన్‌మెంట్లు, మొబైల్ ఫోన్. ఉదయం 6 గంటలకు లేవాల్సి రావడం. తరగతుల్లో నిద్ర, చిరాకు. మార్కులు తగ్గాయి. తల్లిదండ్రులు అతన్ని 'సోమరి'గా భావించారు. నన్ను సంప్రదించగా, అతనికి నిద్రలేమి వల్ల కలిగిన మానసిక అలసట ఉన్నట్టు తేలింది. కౌన్సెలింగ్, నిద్ర సమయాన్ని క్రమబద్ధం చేయడం, రాత్రి స్క్రీన్ వాడకాన్ని తగ్గించడం, ఉదయం ఎండలో నడక అలవాటు చేయడంతో మూడు నెలల్లో అతని ఏకాగ్రత, ఉత్సాహం తిరిగి వచ్చాయి. ఇది చెబుతున్నది ఒక్కటే..సమస్య పిల్లల్లో కాదు, వారి జీవనశైలిలో ఉంది.

ఆలస్యమైన భోజనం.. సమస్యలు
రాత్రి 10 గంటల తర్వాత భోజనం చేయడం జీవక్రియలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యువ వయసులో ఇది పెద్దగా కనిపించక పోయినా, దీర్ఘకాలంలో ఊబకాయం, డయాబెటిస్, రక్తపోటు ప్రమాదం పెరుగుతుంది. ఇవి తిరిగి ఆత్మవిశ్వాసం తగ్గించి మానసిక సమస్యలకు దారితీస్తాయి.

**మంచి నిద్రే నిజమైన మందు :** ఈ సమస్యలకు పరిష్కారం మాత్రల్లో కాదు, అలవాట్లలో ఉంది. పడుకునే గంట ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండాలి. నిద్రలేచే సమయాల్లో క్రమశిక్షణ అవసరం. వ్యాయామం, ఆటలు ఒత్తిడిని తగ్గిస్తాయి :

**ధ్యానం, యోగా మనసును స్థిరపరుస్తాయి :** ఇవి మెదడులో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను తగ్గించి, నిద్రకు అవసరమైన మెలటోనిన్‌ను పెంచుతాయి.

సూర్యరశ్మి -- సహజ **మానసిక వైద్యం :** ఉదయం ఎండలో కొద్దిసేపు ఉండటం వల్ల సెరటోనిన్ విడుదలై ఆనందభావన పెరుగుతుంది. ఏకాగ్రత మెరుగవుతుంది. విటమిన్ ఞ ద్వారా శరీర బలం, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది శరీరానికే కాదు, మనసుకూ అవసరమైన వైద్యం.నేటి విద్యార్థుల్లో పెరుగుతున్న నిద్రలేమి ఒక హెచ్చరిక. నిద్రను త్యాగం చేసి సాధించిన విజయం నిలకడగా ఉండదు. నిద్రలేని విజయం మానసికంగా ఖరీదైన విజయం.విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటే ముందుగా వారి నిద్రను కాపాడాలి. అదే ఆరోగ్యకరమైన సమాజానికి తొలి అడుగు.



. డా హిప్నో పద్మ కమలాకర్
సైకాలజిస్ట్ ॰ హిప్నో థెరపిస్ట్
హైదరాబాద్ -
9390044031

# ఆయుర్వేదం - కేశ సమస్యలు




మన

స్త్రీ,పురుషుల బాహ్య సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తే అంశాల్లో వెంట్రుకలది ప్రధానమైన పాత్ర అని చెప్పుకోవచ్చు. మంచి కేశసంపద ఉన్న వాళ్ళు అందంగా నిండుగా కనబడుతారు.

కానీ నేటి జీవనం లోని సంక్లిష్టత వలన, జీవన శైలిలోని మార్పుల వలన, జీవిస్తున్న పరిస్థితుల వలన, యువతీ యు-ువకులు పాతిక సంవత్సరాలకే వెంట్రుకలు రాలిపోయి బట్టతలతో దర్శనమిస్తున్నారు.

భారతీయ పాచీన వైద్య సంపదాయమైన ఆయుర్వేదం, మానవుని ప్రతి ఆరోగ్య సమస్యను అనాడే గుర్తించి, అందుకు యోగ్యమైన ఔషధాలను ఆనాడే సూచించింది. అందుకే ఆయుర్వేదం. జీవనవేదం అయ్యింది.

ముఖ్యంగా కేశ సంబంధ సమస్యలకు ఉపయుక్తమైన ద్రవ్యాలను, వాటి తయారీని, వాడకాన్ని, చాలా సృష్ఠంగా చెప్పింది. ఈ నాటి యువత కేశ సమస్యలకు సరియైన సమాధానం ఆయుర్వేదం. పాలిత్యము - (ప్రీమాచ్యూర్ గ్రేయింగ్ ఆఫ్ హెయిర్), ఆయుర్వేదం ప్రకారం జుట్టు చిన్న వయసులో, ముందుగానే తెల్లబడటాన్ని పాలిత్యం అంటారు. త్రిదోషాల్లోని పిత్త దోషం ప్రకోపం వల్ల (పిత్తం కేశ మూలాల్లో అధికమవడం) దీనికి కారణాలు,అధిక మానసిక ఒత్తిడి,అధిక ఉష్ణాహారం (కారం, మసాలా),రాత్రి నిద్రలేమి, వంశపారంపర్య, జన్యుపరమైన కారణాలు,విటమిన్ బి 12, కాపర్ లోపం, ఆక్సిడేటివ్ స్ట్రెస్, థైరాయిడ్ సమస్యలు ఖాలిత్యము - (హెయిర్ ఫాల్) , ఆయుర్వేదం ప్రకారం క్రమంగా జుట్టు రాలిపోవడం

**త్రిదోషాల లోని,వాత ం పిత్త ప్రకోపం వల్ల, పాథోజెనసిస్:**
పిత్తం వల్ల కేశ మూలాలు బలహీనమవడం వాతం వల్ల పోషణ లోపించడం, డి హెచ్ టి హార్మోన్ ప్రభావం, పోషక లోపాలు, హార్మోనల్ మార్పులు మొదలైన కారణాలు. ఇంద్రలుప్తము - (అలోపెసియా ఏరియాటా) , వాడుక భాషలో పేను కొరుకుడు అని పిలుస్తాము. అకస్మాత్తుగా వృత్తాకారంగా జుట్టు రాలిపోవడం ఇందులో ఉంటుంది.

త్రిదోషాలలో, ప్రత్యేకంగా పిత్త ం కఫం, ఇందులో విశేష లక్షణం ఏమిటంటే మళ్లీ జుట్టు వచ్చే అవకాశం ఉంటుంది.ఇదొక ఆటో ఇమ్యూన్ డిసార్డర్ అంటే శరీరం తన కేశ మూలాలనే శత్రువులుగా భావించడం.

త్రిదోషాలను సమతుల్యంగా ఉంచుకోవడం, ఆహార విహారాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం , ఐరన్ ,జింక్ మరియు కాపర్ వంటి సూక్ష్మ పోషకాలు తీసుకోవాలి, థైరాయిడ్, ఇతర హార్మోన్లు సమతుల్యంగా ఉంచుకోవడం. పర్యావరణ కాలుష్యం నుండి వెంట్రుకలను కాపాడుకోవడం, ఎక్కువగా హెయిర్ డ్రైయర్స్ వాడకపోవడం, హెల్మెట్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవడం,

రెగ్యులర్ గా హెయిర్ కట్ చేయించుకోవడం , అధికంగా కెమికల్ షాంపూలు వాడటం చేయద్దు. శరీరాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుకోవాలి అంటే నీరు అధికంగా తీసుకోవాలి, తల స్నానికి వీలైనంతగా బోర్ వాటర్ అవాయిడ్ చేయాలి, ట్రీటెడ్ వాటర్ మాత్రమే వాడాలి. అన్నింటికంటే ముఖ్యమైన విషయం స్ట్రెస్ మేనేజ్మెంట్, ఒత్తిడి తగ్గించుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆయుర్వేదం ఈ కేశ సంరక్షణకు అద్భుతమైన విధానాలను సూచించింది.సమస్యలు విపరీతమైనప్పుడు ఆయుర్వేద వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



డా. జి మహేంద్ర కుమార్ రెడ్డి
ఆయుర్వేదిక్ ఫిజిషియన్
మహేంద్రాస్ మైండ్
అండ్ బాడీ

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18.1.2026
ఆదివారం అనుబంధం

# మా ఊరిలో నా సంక్రాంతి పండుగ

## ఈ వారం కథ



సంక్రాంతి సెలవులు పెంచమని ఎందుకురా? మేనేజర్ తో గొడవ పడతావ్. అసలేముందిరా మీ ఊర్లో ? అన్న మా ఫ్రెండ్ తో మా ఊర్లో ఏముందా! అసలు ఎక్కడి నుంచి మొదలు పెట్టాలో! ఎలా మొదలు పెట్టాలో! అర్థం కాలేదు నాకు. సంక్రాంతి అంటే భోగి మంటలు, ముగ్గులు, కొత్త బట్టలు, పేకాటలు అబ్బో! ఇలా చెప్తే చాలా ఉన్నాయి. అయినా ఈ సంక్రాంతి పండుగ కోసం సంవత్సరం అంతా ఎందుకు ఎదురు చూస్తామో తెలుసా! అంటూ ఇలా మొదలెట్టాను....

ఒకవైపు కొత్త సంవత్సరానికి హాయ్ చెప్పి, మరోవైపు సంక్రాంతి పండుగ పనులు మొదలు పెడతాం. మొదటిగా ఇంటిని శుభ్రం చేయడంతోనే ప్రారంభిస్తాం. మా భాషలో ఈ శుభ్రం చేయడానికి 'పట్లుదులపడం' అని కూడా అంటారు. ఏడాదికొకసారి అటక మీద ఉన్న సామాన్లు దించి కడుగుతాము. ఇల్లంతా శుభ్రం చేసుకొని ఆ తర్వాత కొత్త బట్టలు కొనడానికి షాపులకి వెళ్తాం, నచ్చినవి కొనుక్కుంటాం. ఈ లోపే సంక్రాంతి సెలవులు మొదలయ్యాక దూరంగా చదువుకుంటున్న మా అక్కలు, చెల్లెళు, అన్నయ్యలు, బావలు అందరూ వస్తారు. మీకు ఒక్కటి చెప్పనా! మేము అందరం ఇలా ఒక్కటిగా కలిసేది ఒక్క సంక్రాంతి పండక్కి మాత్రమే. అంతే ఇక హడావిడి స్టార్ట్ అయిపోయింది. హరిదాసులు, గంగిరెద్దులవారు ప్రతి ఇంటికి వస్తారు. అమ్మావాళ్ళు వాళ్ళకి చీరలు, డబ్బులు, బియ్యం ఇచ్చి దానం చేస్తారు. సంక్రాంతి పిలుపులు - అల్లుడిని అత్తవారింటికి పిలుస్తారు కదా! మా నాన్నగారు కూడా వాళ్ళ అక్కవాళ్ళ ఇంటికి వెళ్లి సంక్రాంతికి అందరూ తప్పకుండా రావాలని వాళ్ళ అక్క బావలను పిలుస్తారు. మా అక్కాచెల్లెల్లము కల్లం దగ్గర ఉన్న పెద్ద పణుకు మీద భోగి పిడకలు తయారు చేస్తాం. ఇక భోగి ముందు రోజు రాత్రి మా అక్కా చెల్లెల్లం అందరం కలిసి గోరింటాకు పెట్టుకోవడం. ఒకరి మీద ఒకరం బోలెడు జోకులు వేస్తూ నవ్వుకోవడం చేస్తాం. మేము అమ్మాయిలం కదండి! అందుకే ముందుగానే అందరం కలిసి ఏ రోజు ఏ డ్రెస్ వేయాలో మాట్లాడుకుంటాం. మేము అనుకున్నట్టే పండుగ మూడు రోజులూ బట్టలు ధరిస్తాము. ప్రతిసారి నేను మాత్రం మా చెల్లెళ్లకు నన్ను పొద్దున్నే భోగి మంట దగ్గరకు లేపడం మర్చిపోకండర్రా! అని చెప్తాను. పొద్దున్నే నాలుగు గంటలకు మా చెల్లెళ్ళు మా ఇంటికి వచ్చి తలుపు తట్టి మరీ లేపుతారు. అలా అందరం కలిసి మా అక్క వాళ్ళ ఇంటికి వెళ్లి, తనని కూడా లేపి, భోగి మంట దగ్గరికి తీసుకొని వెళ్తాం. ఆ భోగి మంటలో భోగి పిడకలు వేసి దేవుణ్ణి మొక్కుకుంటాము. అలా మంట దగ్గర కాసేపు సమయం గడిపి, ఇంటికి వెళ్లి తలస్నానం చేసుకుంటాం. అందరం రెడీ అయిన తర్వాత మా చిన్నాన్న వాళ్ళ స్కూల్లో కలిసి రీల్స్ చేస్తాం. మా వీధిలో మా అక్కావాళ్ళు వారి పిల్లలకు తలపై భోగిపళ్ళు (రేగుపళ్ళు) పోస్తారు. ఆ కార్యక్రమానికి మేమంతా సరదాగా వెళ్తాం. సాయంత్రం అయ్యే సరికి మా వీధిలో యూత్ ముగ్గులు పోటీ పెడతారు. పోటీలో హుషారుగా పాల్గొంటాం. ఎవరి ఇంటి ముందు వారు ముగ్గు వేస్తాం. మా ఇంటి ముందు నేను ముగ్గు వేసి గొబ్బెమ్మ పెడతా. మరసటి రోజే సంక్రాంతి! పొద్దుగానే లేచి తలంటు స్నానం చేసి లంగావోణీ వేసుకొని మంచిగా తయారవుతా. పూజకు కావలసిన పనులన్నీ చేస్తా. పంతులుగారు ఇంటికి వస్తారు మా అమ్మ నాన్న కలిసి పెద్దలకు బోజీలు సమర్పించి పూజను చేస్తారు. అమ్మ , పెద్దమ్మ వాళ్ళు పొంగడాలు, అరిసెలు ఇంకా రకరకాలు పిండి వంటలు చేస్తారు. నేనొక పక్క భోజనాలు తయారు చేస్తాను. కలగాయకూర, తీపి పప్పు మాత్రం మా అమ్మావాళ్ళే వండుతారు. అమ్మావాళ్లు వీధిలో ఉన్న ముత్తైదువులకు ఇంటికి పిలిచి పసుపులు పోస్తారు. మా వీధి అందరం కలిసి పేరంటాలమ్మలు ఉండే గుండాలకి (చిన్నగుడి) బ్యాండ్ బాజాలతో వెళ్లి మా ఇంటి పేరంటాలమ్మను దర్శించుకుంటాం. అమ్మావాళ్ళు ఒక పక్క పూజలు చేస్తుంటే, మా యూత్ అందరం కలిసి ఫోటో సెల్ఫీస్ తీసుకోవడం. లాగ్స్ చేయడం చేస్తూ ఉంటాం. తర్వాత ఇంటికి వచ్చి ఒక మూలన పెద్దలకు మడపళ్ళలో బోనాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటాం. తర్వాత మేము అందరం కలిసి భోజనాలు చేస్తాం. మా నాన్న, పెదనాన్న నేను చేసిన వంటలు తిని మెచ్చుకుంటుంటారు. కానీ, మా అన్నయ్య మాత్రం అంతేం బాలేదు అని నన్ను ఏడిపిస్తాడు. మా ఇంటికి జంగాల వాళ్ళు వస్తారు. మా నాయనమ్మ వాళ్ళతో దగ్గర కూర్చొని పెద్దల పేర్లు ఒక్కొక్కటి చెప్పగా వాళ్లు గంట కొడుతూ, పాట పాడుతూ పొగుడుతారు. నేను మా చెల్లెల్లం కలిసి గాలిపటాలు తయారు చేసి సాయంత్రం మేడ మీదకి వెళ్లి ఎగరవేస్తాము. రాత్రికి మా ఆంటీ వాళ్ళ ఇంటికి వెళ్లి అక్కడ మా కజిన్స్ అంతా కలిసి పాటలు వేసుకుంటూ, డాన్సులు చేస్తాం. ఇంకా బోలెడన్ని గేమ్స్ ఆడుకుంటాము. ఆ మరుసటి రోజు కనుమ. ఇంక మా అత్తావాళ్ళు మా ఇంటికి వస్తారు. వారికోసం ప్రత్యేకంగా రకరకాల వంటకాలు తయారు చేస్తాం. ఆరోజు నాన్ వెజ్ డిషెస్ ప్రత్యేకంగా ఉంటాయి. మా పెదనాన్న పశువులకు స్నానం చేసి, వాటి కొమ్ములకు రంగులు పూసి, బొట్టులు పెట్టి, పూజ చేసి, నమస్కరిస్తారు. అత్త, మావయ్య, నాన్న, బావులు, అన్నయ్య, నేను అందరం కలిసి పుష్టిగా భోజనాలు చేస్తాం. భోజనాలు అయ్యాక అందరం కూర్చుని సరదాకి పేకాట ఆడుకుంటాము. ఆరోజు సాయంత్రం మేమందరం అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్తాము. అక్కడ అమ్మమ్మ, తాతయ్య, మామయ్యలు, అత్తయ్యలు అందరూ కలిసి మాట్లాడుకుంటూ సంక్రాంతి స్పెషల్ డిషెస్ తింటూ... అలా ఆరోజంతా అక్కడ సరదాగా గడిపేస్తాము.

# సర్వికల్ క్యాన్సర్ మరణాలను తగ్గించడంలో రెగ్యులర్ హెల్త్ చెకప్‌ల పాత్ర

భారతీయ మహిళలు కుటుంబం, ఉద్యోగం, సంరక్షణ బాధ్యతల మధ్య తమ ఆరోగ్యాన్ని తరచూ వెనుకకు నెట్టేస్తుంటారు. ఒక అపాయింట్‌మెంట్ వాయిదా వేయడం లేదా చిన్న లక్షణాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల సర్వికల్ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు నిశ్శబ్దంగా ముందుకు సాగిపోతాయి. బాధాకరమైన విషయం ఏమిటంటే, ఇది ముందుగానే గుర్తిస్తే నివారించగలిగే, చికిత్స చేయగలిగే వ్యాధి అయినప్పటికీ, ఎక్కువగా ఆలస్య దశలోనే గుర్తించబడుతుంది. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు ఉత్తమ రక్షణగా పనిచేస్తాయి అవి ఒక ప్రమాదాన్ని నియంత్రించగల సమస్యగా మార్చగలవు. సర్వికల్ క్యాన్సర్‌ను అర్థం చేసుకోవడం: నిశ్శబ్దంగా ఎదిగే వ్యాధిసర్వికల్ క్యాన్సర్ గర్భాశయ ముఖద్వారంలోని కణాలలో ఏర్పడుతుంది మరియు సాధారణంగా సంవత్సరాల పాటు మెల్లగా అభివృద్ధి చెందుతుంది. ప్రారంభ దశల్లో నొప్పి లేదా స్పష్టమైన లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఈ నిశ్శబ్ద స్వభావమే రొటీన్ స్క్రీనింగ్‌ను అత్యంత అవసరమైనదిగా మారుస్తుంది. చాలా సందర్భాల్లో ఇది హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) యొక్క కొన్ని రకాలతో దీర్ఘకాలిక సంక్రమణ కారణంగా ఏర్పడుతుంది. హెచ్‌పివి ఇన్ఫెక్షన్ సాధారణమైనదే అయినప్పటికీ, ప్రతి హెచ్‌పివి ఇన్ఫెక్షన్ సర్వికల్ క్యాన్సర్‌కు దారితీయదు. రెగ్యులర్ చెకప్‌లు క్యాన్సర్‌గా మారే ముందు దశలోనే అసాధారణ కణ మార్పులను గుర్తించడంలో సహాయపడతాయి.

**రెగ్యులర్ స్క్రీనింగ్ ఎందుకు ప్రాణాలు కాపాడుతుంది**

రొటీన్ హెల్త్ చెకప్‌ల నిజమైన శక్తి ముందస్తు గుర్తింపులోనే ఉంది. పాప్ టెస్ట్, హెచ్‌పివి టెస్టులు వంటి స్క్రీనింగ్ పరీక్షలు ప్రాణాపాయంగా మారే ముందు కణాలలో జరిగే అసాధారణ మార్పులను గుర్తించడానికి రూపొందించబడ్డాయి. భారతీయ పబ్లిక్ హెల్త్ అధ్యయనాలు మరియు జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ గణాంకాలు చెబుతున్నదేమిటంటే ప్రారంభ దశలో గుర్తించిన మహిళలకు చికిత్స ఫలితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. ప్రారంభ దశ సర్వికల్ క్యాన్సర్‌కు తక్కువ తీవ్రత గల చికిత్స సరిపోతుంది, సంక్లిష్టతలు తక్కువగా ఉంటాయి, మరియు మహిళలు త్వరగా సాధారణ జీవితానికి తిరిగి చేరుకోగలుగుతారు. దీన్ని విరుద్ధంగా, ఆలస్యంగా గుర్తించినప్పుడు చికిత్స మరింత క్లిష్టంగా మారుతుంది, కోలుకునే సమయం పెరుగుతుంది, కుటుంబాలకు భావోద్వేగ భారం మరియు ఆర్థిక ఒత్తిడి కూడా అధికమవుతుంది. ఆలస్యానికి కారణమయ్యే సామాజిక మరియు జీవనశైలి అంశాలు భారతదేశంలో ఆలస్య నిర్ధారణకు అనేక కారణాలు ఉన్నాయి. గైనకాలజీ పరీక్షల పట్ల సంకోచం, అవగాహన లోపం, కొన్ని ప్రాంతాల్లో స్క్రీనింగ్ సదుపాయాల కొరత, కుటుంబ బాధ్యతలు ఇవన్నీ మహిళలను నిరోధిస్తాయి. పట్టణ మరియు అర్ధ పట్టణ ప్రాంతాల్లో పొడవైన పని గంటలు, ఒత్తిడి, తగిన నిద్రలేమి, వైద్యులను ఆలస్యంగా సంప్రదించడం వంటి జీవనశైలి మార్పులు ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. యువ మహిళల్లో సర్వికల్ క్యాన్సర్ వృద్ధులకే వస్తుందనే అపోహ కూడా ప్రమాదాన్ని పెంచుతోంది. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు లక్షణాల కోసం వేచిచూడకుండా, నివారణను ఒక అలవాటుగా మార్చుతాయి.

**స్క్రీనింగ్ తర్వాత ఏమి జరుగుతుంది?**

స్క్రీనింగ్‌లో అసాధారణ ఫలితం వచ్చిందంటే క్యాన్సర్ అని అర్థం కాదు. ఎక్కువ సందర్భాల్లో, అది కేవలం ప్రారంభ దశ కణ మార్పులను సూచిస్తుంది వీటిని సులభంగా పర్యవేక్షించవచ్చు లేదా చికిత్స చేయవచ్చు. తదుపరి చర్యలుగా మళ్లీ పరీక్షలు, చిన్న విధానాలు లేదా దగ్గరగా పరిశీలించడం ఉండవచ్చు. ఇవన్నీ అభివృద్ధి చెందిన క్యాన్సర్ చికిత్సతో పోలిస్తే చాలా తక్కువ తీవ్రత గలవే. రెగ్యులర్ చెకప్‌లు కౌన్సెలింగ్, టీకాలపై సలహా, అవగాహన కల్పించేందుకు కూడా అవకాశం కల్పిస్తాయి ఇది నివారణకు ఒక రక్షణాత్మక వలయాన్ని సృష్టిస్తుంది.


**అవగాహన మరియు కుటుంబ మద్దతు పాత్ర**

భారతదేశంలో ఆరోగ్య నిర్ణయాలు తరచూ కుటుంబ ప్రభావంతో తీసుకుంటారు. కుటుంబ సభ్యులు నివారణ చెకప్‌ల ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటే, మహిళలు తమ ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా తీసుకుంటారు.

తల్లులు, కూతుళ్లు, సోదరీమణులను రెగ్యులర్ స్క్రీనింగ్‌కు ప్రోత్సహించడం ఒక వైద్య నిర్ణయం మాత్రమే కాదు అది ప్రేమతో కూడిన బాధ్యత. ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు మరియు మహిళా ఆరోగ్య కార్యక్రమాలు పదేపదే చెబుతున్నది ఒక్కటే స్క్రీనింగ్ అలవాటైతే సర్వికల్ క్యాన్సర్ మరణాలు ఎక్కువగా నివారించవచ్చు.

**నివారణే ఉత్తమ చికిత్స**


స్క్రీనింగ్‌తో పాటు, నివారణలో పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ, దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లకు చికిత్స, అసాధారణ రక్తస్రావం లేదా నిరంతర



అసౌకర్యం వంటి లక్షణాలకు వెంటనే వైద్య సలహా తీసుకోవడం కూడా ఎంతో ముఖ్యం. రెగ్యులర్ చెకప్‌లు శరీరాన్ని వినే ఒక క్రమబద్ధమైన విరామంలాంటివి వ్యాధి గొంతెత్తే ముందు మనం వినే అవకాశం ఇస్తాయి.

**కొనసాగకూడని నివారించగల విషాదం**

సర్వికల్ క్యాన్సర్ ఒక ఆలస్య నిర్ధారణగా లేదా జీవితాన్ని మార్చేసే సంక్షోభంగా మారాల్సిన అవసరం లేదు. ఇది నివారణ, ముందస్తు గుర్తింపు మరియు సకాలంలో చికిత్స ద్వారా ఫలితాలను పూర్తిగా మార్చగలిగే అరుదైన క్యాన్సర్లలో ఒకటి. సందేశం స్పష్టం మరియు అత్యవసరం: రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు ప్రాణాలు కాపాడతాయి. అవి మహిళలనే కాదు, వారిపై ఆధారపడే కుటుంబాలను మరియు సమాజాన్ని కూడా రక్షిస్తాయి. రొటీన్ స్క్రీనింగ్‌ను ఒక అపవాదంగా కాకుండా అలవాటుగా మార్చడం భారతదేశంలో సర్వికల్ క్యాన్సర్ మరణాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన అత్యంత శక్తివంతమైన అడుగు. ఒక్క అపాయింట్‌మెంట్‌తో ప్రారంభమయ్యే మార్పు.




డా. ఎ. సత్య శ్రీనివాస్,
కన్సల్టెంట్ మెడికల్ ఒంకాలజిస్ట్,
హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్, విజయవాడ



# వెనిజులాపై అమెరికా జులుం

**వెనిజులాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎప్పటి నుంచో కత్తి కట్టారు. అక్కడి నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ఆరోపణల నేపథ్యంలో అక్కడి కొన్ని ముఠాలు దీని వెనుక ఉన్నాయని...దానికి వెనిజులా నికోలస్ మదురోకు మద్దతిస్తున్నారని ఆగ్రహంతో ఉన్న అగ్రరాజ్యం. వెనిజులా అధ్యక్షుడిని పట్టనివ్వాలని అమెరికా ఎప్పటి నుంచో కోరుతోంది. ఈ క్రమంలోనే ముదురో సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.430 కోట్లు) బహుమతి కూడా ప్రకటించింది. ముదురూ ఎన్నికలను వైట్ హౌస్ గుర్తించడం లేదని ప్రకటించిన వైట్ హౌస్ అక్కడ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ట్రంప్ కార్యవర్గం సన్నాహాలు చేసుకుంది. వెనుజులాపై దాడులు ముమ్మరం చేసి ముదురో పై తనదైన మార్క్ జులుం ప్రదర్శించి అదుపులోకి తీసుకుంది. తాజాగా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు తనదైన శైలిలో అక్కడి నేతలతో మంతనాలు జరుపుతోంది. అసలు వెనిజులా పై అమెరికా వరుసదాడులు అనంతర పరిణామాల గురించి ఓ సారి పరికిస్తే....**

వేగంగా మారుతున్న ప్రపంచ పరిణామాలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి.ఏ పత్రిక తిరిగేసినా వెనిజులా పై అమెరికా సాయుధ తిరుగుబాటు అనే అంశమే పతాక శీర్షికల్లో కనబడుతున్నది. ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియాల్లోనే కాకుండా ఎస్ఎమ్ లో కూడా ఇటీవల వెనిజులా కు సంబంధించిన అంశాలే అధికంగా కనిపిస్తున్నాయి. అమెరికా సారధ్యంలోని సాయుధ బలగాలు పక్కా ప్రణాళికతో వెని జులా అధ్యక్షుడు నికోలస్ మదురో నివాసాన్ని మెరుపు వేగంతో ముట్టడించి, మదురోను సంకెళ్ళతో నిర్భంధించి, ఆయనపై నార్కో టెర్రరిజం వంటి అభియోగాలు మోపి న్యూయార్క్ ఫెడరల్ కోర్టులో దోషిగా నిలబెట్టిన ఉదంతం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అమెరికా చర్యను కొన్ని యూరోపియన్ దేశాలు, మరికొన్ని బ్రిక్స్ దేశాలు కూడా తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయ చట్టాలను, నియమ నిబంధనలను ఉల్లంఘించి, ఒక సార్వభౌమాధికార దేశమైన వెనిజులా పై అమెరికా కేవలం ఉద్దేశ్య పూర్వకం గానే దాడి చేసిందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ప్రపంచ పోలీస్ లా వ్యవహరిస్తున్న అమెరికా కేవలం పేరుకే ప్రజాస్వామ్య దేశం.సామ్రాజ్యవాద దృక్పథంతో, అగ్ర దేశమన్న అహం భావంతో, ఇతర దేశాల సంపదను కొల్లగొట్టడానికి అమెరికా అడ్డదారుల్లో పయనించడం ఆక్షేపణీయం. డోనాల్డ్ ట్రంప్ దురహంకారం ప్రపంచ శాంతికి భంగకరంగా మారింది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే అమెరికా కు వ్యతిరేకంగా ప్రపంచంలోని ఇతర బలమైన దేశాలు ఐక్యమయ్యే సూచనలు కానవస్తున్నాయి. ట్రంప్ పోకడలు మూడవ మహా సంగ్రామానికి దారితీసినా ఆశ్చర్య పోనక్కరలేదు. ఇప్పటికే ట్రంప్ నిర్ణయాల వలన ప్రపంచ ఆర్ధిక స్థితి గతులు తారుమారవుతున్నాయి. ప్రతీకార సుంకాల పేరుతో ట్రంప్ సాగిస్తున్న ట్రేడ్ వార్ తలనొప్పిగా మారింది. భారత దేశాన్ని కూడా ట్రంప్ టార్గెట్ గా చేసుకుని పావులు కదుపుతున్నాడు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తే భారత్ పై ఇప్పటి కంటే ఎక్కువ గా టారిఫ్ లను విధిస్తానని, తాను సంతోషం గా లేని విషయం భారత ప్రధాని మోడీకి తెలుసునని, తనను సంతోష పెట్టకపోతే ఏం జరుగుతుందో ట్రంప్ ఇప్పటికే భారత్ కు హెచ్చరిక జారీ చేసాడు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇప్పటివరకు భారత ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు.అయితే భారత– రష్యా చిరకాల స్నేహాన్ని,సాన్నిహిత్యాన్ని, ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను దెబ్బతీయడమే ట్రంప్ దురుద్దేశం గా కనబడుతున్నది. నికోలస్ మదురో నిర్భంధాన్ని బూచిగా చూపించి, క్యూబా,మెక్సికో,గ్రీన్ లాండ్,కొలంబియాలపై అమెరికా విరుచుకు పడడం, చమురు తామే నియంత్రించి,వెనిజులా దేశం లోని చమురును విక్రయిస్తామని చెప్పడం ట్రంప్ దుర్మార్గానికి పరాకాష్ట.వెనిజులా ను తమ దేశం పాలించదని, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో వెల్లడించినా, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్స్ సైతం తాము అమెరికా కు వలస దేశంగా ఉండజాలమని ఉద్ఘాటించినా, ఇది కేవలం మేక పోతు గాంభీర్యం గానే భావించాలి. మరికొద్ది రోజుల్లో గ్రీన్ లాండ్ సంగతి తేలుస్తానని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించడాన్ని బట్టి చూస్తుంటే, భవిష్య ప్రపంచ పరిణామాలు సామ్రాజ్యవాద,నియంతృత్వ శక్తుల బలోపేతానికి దారి తీయవచ్చు. ఇరాన్ పై కూడా అమెరికా ప్రత్యక్ష దాడులకు దిగే అవకాశాన్ని తోసిపుచ్చలేం. ఇప్పటికే ఇరాన్– అమెరికాల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. శాంతి దూతగా తనను తాను అభివర్ణించుకున్న ట్రంప్ ప్రస్తుతం తన బాధ్యత మరచి ప్రపంచాన్ని యుద్ధోన్మాదం వైపు నడిపిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.



అమెరికా ఇలా బరి తెగించి ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని పరిహసించి,పరిహరిస్తే చైనా లాంటి దేశాలు కూడా అదే దారిలో నడవవచ్చు. తైవాన్ ను ఆక్రమించుకోవడానికి ఎప్పటి నుంచో కాసుకు కూర్చున్న చైనా కు అమెరికా ప్రస్తుత చేష్టలు బలం చేకూర్చవచ్చు. అమెరికా దౌర్జన్యాలను సహించిన ఐక్యరాజ్య సమితి, ప్రపంచదేశాలు రానున్న రోజుల్లో ఇతర దేశాలపై దాడి చేస్తే ఖండించలేని అసహాయ పరిస్థితులు ఏర్పడతాయి.

**గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ ధోరణి:–**

ప్రపంచంలోని అతి పెద్ద ద్వీపంగా ఉత్తర అమెరికాలోని గ్రీన్ లాండ్ పేరొందింది. ఇది ఉత్తర ఐరోపాలోని డెన్మార్క్ సామ్రాజ్యంలోని ఒక స్వయం ప్రతిపత్తి గల దేశం. గ్రీన్ లాండ్ అమూల్యమైన ఖనిజ సంపదకు నిలయం. అయితే ఇప్పుడు గ్రీన్ లాండ్ పై అమెరికా కన్ను పడింది.రష్యా,చైనా ల వలన తమ దేశ భద్రతకు ముప్పు ఏర్పడనున్న దృష్ట్యా గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ ప్రకటించడాన్ని అమెరికాతో సహా కొన్ని యూరోపియన్ దేశాలు కూడా ఖండించాయి. గ్రీన్ లాండ్ పై దాడి చేస్తే నాటో కూటమి ఉండదని డెన్మార్క్ ప్రధాని మెటే ఫ్రెడెరిక్సన్ హెచ్చరించగా, డెన్మార్క్ ను పలు దేశాలు సమర్ధించాయి.గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను గ్రీన్ ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ తీవ్రంగా ఖండించారు. తమ దేశ ఆర్ధిక పరిస్థితులను చక్కదిద్దుకోవడానికి టారిఫ్ లతో రెచ్చిపోతున్న డోనాల్డ్ ట్రంప్ ఇతర దేశాల్లోని ఖనిజ సంపదపైన, చమురు నిక్షేపాలపైన కన్నేసి కాజేయడానికి జరిగే ప్రయత్నాల్లో భాగమే గ్రీన్ లాండ్ ను ఆక్రమించాలన్న ఆలోచనకు పునాదిగా భావించవచ్చు.

**మెక్సికో పై అమెరికా దృక్పథం:–**

మెక్సికో ను ఆక్రమించుకోవాలన్న దురాశ ట్రంప్ లో కలిగింది. అమెరికాకు మెక్సికో పౌరుల అక్రమ వలసలను అరికట్టే ఉద్దేశ్యంతో మెక్సికో గోడ కట్టడానికి గతంలో తన హయాంలోనే ట్రంప్ అంకురార్పణ చేయడం జరిగింది. అమెరికా కు మెక్సికో వాణిజ్య భాగస్వామి అయినప్పటికీ, మెక్సికన్లపై అమెరికా ప్రజలకు సదభిప్రాయం లేదు.



**ఇరాన్- అమెరికా ఉద్రిక్తతలు:-**

ఇరాన్ విషయంలో అమెరికా కోపోద్రేకం తీవ్రస్థాయికి చేరింది. ఇజ్రాయిల్-ఇరాన్ ల మధ్య గతంలో జరిగిన సంఘర్షణ తీవ్ర స్థాయికి చేరిన తరుణంలో అమెరికా మధ్యవర్తిత్వం వహించి తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిర్చింది. అయితే ప్రస్తుతం ఇరాన్,అమెరికాలు పరస్పరం వాగ్బాణాలు సంధించుకుంటున్నారు. ఇరాన్ పై దాడికి సిద్ధమంటూ అమెరికా హెచ్చరించడం, దానికి ఇరాన్ ట్రంప్ ను హేళన చేస్తూ అమెరికా గతంలో ఇరాక్,ఆఫ్ఘన్ ల విషయంలో చేసిన దారుణాల గురించి, ఆయా దేశాల్లో అమెరికా బలగాల అర్ధాంతర ఉపసంహరణ గురించి పేర్కొంటూ ఇరాన్ ను అమెరికా ఏమీ చేయలేదని పేర్కొంది.

**అమెరికాపై మండిపడుతున్న ఉత్తర కొరియా:-**

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్ ఇటీవల వెనిజులా రాజధాని కారకాస్ పై దాడి చేసిన అమెరికా పై తీవ్ర స్థాయిలో మండిపడుతూ,తమ దేశం పై అమెరికా కుట్రలు పన్నుతున్నదని,తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి యత్నిస్తున్నదని ఆరోపిస్తూ, అమెరికా ఆధిపత్య ధోరణిని క్షమించబోనని పేర్కొంటూ ఉత్తర కొరియా అణు,క్షిపణి కార్యక్రమాలకు ముమ్మరం చేసింది. బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది.

**క్యూబాకు అమెరికా హెచ్చరిక:-**

కొలింబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ట్రంప్ హెచ్చరిస్తూ తన అస్తిత్వాన్ని కాపాడుకోమని సూచించడం లో గల ఆంతర్య మేమటి? క్యూబా పై అమెరికా దాడి చేసి అధికారం చేపడుతుందనే సంకేతమే ట్రంప్ హెచ్చరిక సారాంశం.

**పాక్ పాట పడుతున్న ట్రంప్:-**

కొంతకాలం క్రితం వరకు పాకిస్తాన్ విషయంలో వ్యతిరేకత ప్రదర్శిస్తూ వచ్చిన అమెరికా వైఖరిలో భారత్ పాక్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత గణనీయమైన మార్పు వచ్చింది. భారత ఆయుధ,సైనిక,సాంకేతిక సామర్థ్యం పట్ల అమెరికా ఈర్ష్యాద్వేషాలు పెంచుకుంది. ఉగ్రవాద దేశమైన పాక్ తో అంటుకాగుతూ,భారత్ కు వ్యతిరేకంగా మాట్లాడడం, అసీమ్ మునీర్ ను కీర్తించడం అమెరికా దిగజారుడు విధానాలకు పరాకాష్ట. భారత్ పై కోపంతో పాక్ కు ప్రపంచ బ్యాంకు,ఐ.ఎం.ఎఫ్ ల ద్వారా ఆర్థిక సహాయ మందించడమే కాకుండా,పాక్ లో చమురు ను వెలికి తీసి ఆ దేశాన్ని చమురు సంపన్న దేశంగా మార్చడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తున్నది.

ఇలా ఒకటేమిటి తనకు నచ్చని, తన దేశ వాణిజ్య ప్రయోజనాలకు సహకరించని పలు స్వతంత్ర దేశాల విషయంలో అమెరికా బెదిరింపులకు పాల్పడుతున్నది. వెనిజులా చైనా తో సత్సంబంధాలు కొనసాగించడం, చైనాకు ప్రధాన చమురు దేశంగా మారడంతో పాటు చైనా కరెన్సీ యువాన్ ను,రష్యా రూబుల్ ను డాలర్ కు ప్రత్యామ్నాయంగా చెలామణీ చేయడం వంటి చర్యలే వెనిజులా పై దాడికి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధానికి దారితీసాయని స్థూలంగా చెప్పవచ్చు.

ప్రపంచంలో నాల్గవ పెద్ద ఖండమైన దక్షిణ అమెరికాలోని 12 సార్వభౌమత్వ దేశాలలో అత్యధిక భూ విస్తీర్ణత గల దేశాల్లో వెనిజులా ఆరవ స్థానం ఆక్రమించింది.

భౌగోళిక,సాంస్కృతిక,భాషా వారసత్వ విశిష్టతలు కలిగి, అపారమైన ఖనిజ నిక్షేపాలతో,సహజ వనరులతో చమురు క్షేత్రాలతో, జీవవైవిధ్య సౌందర్యంతో అలరాడే వెనిజులా "ల్యాండ్ ఆఫ్ వరల్డ్ బ్యూటీసు గా ప్రఖ్యాతి గాంచింది.లాటిన్ దేశాల్లో వెనిజులాకు ఎంతో ప్రాముఖ్యత గలదు. ప్రస్తుత వెనిజులా జనాభా 29 నుండి 30 కోట్ల వరకు ఉండవచ్చు. వెనిజులా ప్రపంచంలో 303 బిలియన్ల బ్యారెల్స్ తో అతి పెద్ద నిరూపిత ముడిచమురు నిల్వలున్న దేశంగా నిర్ధారించబడింది. ఆ తర్వాత స్థానాల్లో సౌదీ అరేబియా,ఇరాన్ తదితర దేశాలున్నాయి. అమెరికా,రష్యా,సౌదీ అరేబియా కెనడా,చైనా,ఇరాన్,ఇరాక్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లు చమురు ఉత్పత్తుల్లో ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్నాయి. చమురు లేనిదే పూట గడవని పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో చమురు కోసం యుద్ధాలు జరిగే రోజులు ఏర్పడుతున్నాయి. వర్తమాన ప్రపంచంలో చమురు చుట్టూనే రాజకీయ,వాణిజ్య సంబంధాలు పరిభ్రమిస్తున్నాయి. ప్రస్తుతం "వెనిజులా" పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమ్రోగుతున్నది. దీనికి కారణం అమెరికా చేపట్టిన "ఆపరేషన్ అబ్సల్యూట్ రిసల్వ్ వేలాది మంది కమెండోల పర్యవేక్షణలో,క్యూబా ఏజెంట్ల గస్తీలో అత్యంత శతృదుర్భేధ్యమైన రక్షణ వలయాన్ని అమెరికా ఛేధించి, వెనిజులా అధ్యక్షుడైన నికోలస్ మదురో ను చుట్టుముట్టి, చేతులకు సంకెళ్ళు బిగించి, "నార్కో టెర్రరిస్టు"గా అభియోగం మోపి న్యూయార్క్ లోని ఫెడరల్ కోర్టులో హాజరు పరిచి,బోనులో నిలబెట్టి, భయంకరమైన నేరస్థులకు,డ్రగ్స్ స్మగ్లర్లకు, నరహంతకులకు నిలయమైన కారాగారం లో బంధించడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఒక సార్వభౌమత్వ దేశం లోకి మరొక దేశం ఎవరి అనుమతి లేకుండా, ప్రవేశించడమే కాకుండా వెనిజులాను తమ వలస రాజ్యంగా భావించడం,వెనిజులా లోని చమురును తామే అమ్ముతామని ప్రకటించడం అగ్ర దేశ అపరిమిత అహంకార ధోరణికి దర్పణం పడుతున్నది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఇప్పటివరకు ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్జ్ పదవీ బాధ్యతలు చేపట్టారు.ట్రంప్ తెంపరి తనం ప్రపంచాన్ని అరాచకం వైపు నెట్టింది. అంతర్జాతీయ చట్టాలుగాని, ఐక్యరాజ్య సమితి గాని అమెరికాను ఏమీ చేయలేవని ఈ చర్య ద్వారా నిరూపితమైనది. అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోకుండా అమెరికా వెనిజులా పై సాయుధ దుశ్చర్యకు పాల్పడడం క్షమార్హం కాదు. రానున్న రోజుల్లో చైనా కూడా అమెరికా బాటలోనే నడిచి తైవాన్ పై దాడి చేసే అవకాశముంది. ఇప్పటికే ఉరిమురిమి చూస్తున్న ఉత్తర కొరియా, ఇజ్రాయిల్ దేశాలు కూడా బలహీన దేశాలపై దాడి చేసే అవకాశాలున్నాయి. ట్రంప్ ఎందుకింత అరాచానికి ఒడిగట్టాడు? వెనిజులా చేసిన పాపమేమిటి? మదురో చేసిన నిజమైన నేరమేమిటి? అనే అంశాల గురించి చర్చిద్దాం.



## భారత్ పై ట్రంప్ టారిఫ్ వార్

భారత్ ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చుకుండా తటస్థ వైఖరి అనుసరిస్తూ, తన సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ, రష్యా తో చిరకాల మైత్రిని కాపాడుకుంటూ, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్నది. అయితే రష్యాతో భారత్ ఆయుధ ఒప్పందాలు కుదుర్చుకోవడం, చమురు కొనుగోలు చేయడం ట్రంప్ కు మింగుడు పడని చర్యగా మారింది. ఈ కారణంగానే భారత్ పై అధిక శాతం సుంకాలు విధించి, భారత్ తన వైఖరి మార్చుకోకుంటే, మరిన్ని సుంకాలను విధిస్తానని, తనను మోడీ సంతోష పెట్టాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లోని ఆంతర్యం గ్రహించాలి. గతంలో కూడా అమెరికా ఒత్తిళ్ళతో, ఇరాన్,వెనిజులా దేశాలపై విధించిన ఆంక్షల కారణంగా భారత్ ఆ దేశాల నుండి చమురు దిగుమతులను తగ్గించుకుంది. ఇప్పుడు రష్యా వద్ద నుంచి చమురు కొనుగోలు చేయవద్దని ట్రంప్ హెచ్చరించడం అమెరికా ఆధిపత్య ధోరణికి అద్దం పడుతున్నది. భారత్ వంటి అధిక జనాభా కలిగిన,బలమైన ఆర్థిక వ్యవస్థలు గల సార్వభౌమత్వ దేశాలపై అమెరికా పెత్తనం గర్హనీయం. అమెరికా చెప్పినట్లు తలాడిస్తూ పోతే భారత్ కు ప్రపంచ దేశాల్లో గల విలువ తగ్గిపోతుంది.

**వెనిజులా పై అమెరికా ఆగ్రహానికి కారణాలు:-**

వెనిజులా పై కత్తి గట్టి,మదురోను గద్దె దించడానికి ట్రంప్ ప్రత్యేక ఆసక్తి కనబరచడానికి మన ఊహకందని విషయాలెన్నో ఉన్నాయి. మన ఆలోచనా పరిధిని బట్టి కారకాస్ పై సాయుధ దాడికి ముఖ్యంగా నాలుగు కారణాలున్నాయని చెప్పవచ్చు.

1)అమెరికాకు వ్యతిరేకంగా పెట్రో డాలర్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం గా సౌదీ,చైనా,వెనిజులా దేశాలు ఇప్పటికే చర్యలకు ఉపక్రమించాయి. పెట్రో డాలర్ వ్యవస్థకు తూట్లు పడితే, అమెరికా ఆర్థికంగా నష్టపోతుంది. అందుకే అమెరికా ఈ దాడి చేసి, డాలర్ కు వ్యతిరేకంగా ఎవరైనా ప్రత్యామ్నాయ కరెన్సీతో వాణిజ్యం చేస్తే చర్యలు తప్పవన్న సంకేతమిచ్చింది. గతంలో బ్రిక్స్ దేశాలు డాలర్ కు వ్యతిరేకంగా తమ దేశాల కరెన్సీతో వాణిజ్యం చేయాలనే నిర్ణయం తీసుకోవాలనే ప్రతిపాదన పట్ల ట్రంప్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన విషయం విదితమే. అమెరికా డాలర్ కు వ్యతిరేకంగా యువాన్,రూబుల్ వంటి మిత్ర దేశాల కరెన్సీని ప్రోత్సహించి,డాలర్ ను ఉపసంహరించుకోవడమే వెనిజులా పై ట్రంప్ కోపాగ్నికి కారణమైనదనే కథనాలు వెలువడుతున్నాయి.

2)గత సంవత్సరం ఒకానొక సందర్భంలో దమ్ముంటే పట్టుకో... నీ కోసమే ఎదురుచూస్తా నంటూ..ట్రంప్ ను పిరికి పందగా అభివర్ణించిన నికోలస్ మదురో వ్యాఖ్యలు కూడా ట్రంప్ అహాన్ని దెబ్బతీసాయని,ఈ కారణంగానే మదురో పై "ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వు కు దారితీసినట్టు విశ్లేషకుల అభిప్రాయం.

3) ఎన్నో యుద్ధాలను ఆపానని,తనకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించాలని ట్రంప్ పదే పదే డిమాండ్ చేసారు. పాక్ లాంటి దేశాలు ఈ విషయంలో ట్రంప్ కు మద్దతు పలికాయి. ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతి దక్కక పోవడం, వెనిజులా ప్రతిపక్ష నాయకురాలైన మరియా కొరీనా మచాడో ను నోబెల్ శాంతి బహుమతి వరించడం ట్రంప్ ను తీవ్ర నిరుత్సాహ పరిచిందని, ఇది కూడా కారకాస్ పై దాడికి కారణం కావచ్చుననే అభిప్రాయం కూడా ఉంది.విపక్షనేత మచాడో కు నోబెల్ శాంతి బహుమతి లభించిన కారణంగానే వెనిజులా తాత్కాలిక అధ్యక్ష స్థానానికి ఆమె దూరమైనట్టు వార్తలు వెలువడ్డాయి. ట్రంప్ చర్యను పొగిడినందుకు కూడా ట్రంప్ నుండి మచాడోకు మెచ్చుకోలు దక్కలేదు. పై పైచ్చు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేటంత సీన్ ఆమెకు లేదని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

4)వెనిజులా లోని ఖనిజ సంపదను,చమురు నిల్వలను కొల్లగొట్టడానికే ట్రంప్ వెనిజులా పై దాడికి తెగబడినట్టు కొంతమంది అభిప్రాయం.ఏది ఏమైనప్పటికీ అమెరికా అధ్యక్షుని చర్య ప్రపంచంలోని అనేక దేశాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన మాట వాస్తవం. ట్రంప్ అవివేకం,అహంకారం వలన అమెరికా ప్రతిష్ట మంటగలిసింది. అంతర్జాతీయ చట్టాలకు విలువ లేకుండా పోయింది. గతంలో సద్దాం హుస్సేన్,గడాఫీ లాంటి వారిని అంతమొందించిన చరిత్ర మరవక ముందే డోనాల్డ్ ట్రంప్ తిరిగి అదే చరిత్రను పునరావృతం చేస్తున్న దాఖలాలు కనిపిస్తున్నాయి.

**అధికార లాలస:-**

వెనిజులా సార్వభౌమత్వం మంటగలిసింది. ఒక స్వతంత్ర దేశం పరతంత్ర దేశంగా మారింది, అమెరికా కు వలస రాజ్యంగా మారడం వెనిజులా ప్రజల దౌర్భాగ్యం. ఇందుకు వెనిజులా నాయకుల అధికార వ్యామోహమే కారణం. చావెజ్ నుండి మదురో వరకు ఇప్పుడు డెల్సీ రోడ్రిగ్జ్ వరకు అందరూ అధికారమే పరమావధిగా భావించారు. వెనిజులాను ఆర్థికంగా నిండా ముంచారు. విపరీతమైన ద్రవ్యోల్బణంతో ఆర్థిక లేమితో అభివృద్ధికి దూరమైన వెనిజులా లో మదురో ను గద్దెదింపి,బంధించినందుకు వెనిజులా ప్రజలు ఆనందం వ్యక్తం చేయడం ఎందుకు? నియంతృత్వం,నిరంకుశత్వం నశించిందని ప్రజలు చిందులేయడం ఎందుకు? ఉచితాలను మరిగి ఉన్నది పోగొట్టుకుని, ఇప్పుడు పరాయి దేశం మదురోను నిర్బంధించగానే నియంత గద్దె దిగాడని ఆనంద తాండవమాడం అవివేకం, మూర త్వం. తమ దేశం అమెరికా కబంధ హస్తాల్లో చిక్కుకుందనే స్పృహ లేని,వెన్నెముక లేని వెనిజులా ప్రజల దుస్థితిని చూసి జాలిపడక తప్పదు.

మదురో ను నిర్బంధించగానే ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలైన మచాడో ఒక అడుగు ముందుకు వేసి, ట్రంప్ అడుగులకు మడుగులొత్తడం ఆశ్చర్యకరం. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వనితగా నోబెల్ శాంతి బహుమతి పొందిన మచాడో ప్రపంచం దృష్టిలో చిన్నబోయి,పదవి కోసం ప్రాకులాడడం విచిత్రం.

నికోలస్ మదురో అమెరికా కు పట్టుబడడం తో కొంతమంది ఆనందం వ్యక్తం చేస్తుండగా, మరికొంత మంది బాధ్యత గల వ్యక్తులు ఇది తమ దేశ సార్వభౌమత్వానికి వాటిల్లిన విఘాతం గా భావించి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికా పై ఆధార పడ్డ కొన్ని దేశాలు ట్రంప్ చర్యలను సమర్థిస్తుండగా, మెజారిటీ ప్రపంచం ముక్తకంఠంతో అమెరికా సామ్రాజ్యవాద,సాయుధ దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నది.వెనిజులాలో ప్రజలు కడు పేదరికంతో అలమటిస్తూ ఆహారం లేక ఔషధాలు లేక గత పదేళ్ళలో సుమారు 80 లక్షల ప్రజలు దేశం వదలి పోయారు. 2 కోట్ల మంది అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారు.ఉచిత పథకాలు,విపరీతమైన వ్యయం తో పాటు హ్యూగో చావెజ్ అనాలోచిత నిర్ణయాలు,విధానాలు, పరిపాలనా పరమైన తప్పిదాలు ప్రజల ఆర్థిక స్థితిగతులను దారి తప్పించాయి. చావెజ్ వారసుడిగా అధికార పగ్గాలు చేపట్టిన మదురో కూడా ప్రజలను అభివృద్ధికి దూరం చేసి,ఆర్థిక అరాచకానికి బాట వేసాడు. వెనిజులా మాదిరిగా కాకుండా నార్వే,సౌదీలు వైవిధ్యభరితమైన ఆర్థిక విధానాలను పాటించాయి. చమురును మాత్రమే ఆదాయ వనరుగా భావించిన వెనిజులా ఆర్థికంగా అధః పాతాళానికి దిగజారింది.

## రష్యా పై అమెరికా వైఖరి

గత నాలుగు సంవత్సరాలుగా రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధం తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నది. ఇరు పక్షాల దాడుల్లో సుమారు నాలుగు లక్షల మంది సైనికులు,ప్రజలు మరణించారు. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని నిలువరిస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో వాగ్దానం చేసిన ట్రంప్ అప్పట్లో పుతిన్ కు మద్దతుగా మాట్లాడారు. వైట్ హౌస్ లో జరిగిన చర్చల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తో ట్రంప్ వాగ్వివాదానికి దిగారు. ఇటీవల ఫ్లోరిడా లో ట్రంప్- జెలెన్ స్కీ ల మధ్య జరిగిన చర్చల్లో పురోగతి కనిపించినా డాన్ బాస్ ను రష్యాకు అప్పగించే విషయంలో మాత్రం అంగీకారం కుదరక పోవడం, శాంతి చర్చలు ఫలిస్తాయని ప్రపంచ దేశాలు ఆశిస్తున్న దశలో ఉక్రెయిన్ పుతిన్ అధికార నివాసం పై దాడులకు పాల్పడడంతో పరిస్థితి మొదటికొచ్చింది.




ఈ అస్థవ్యస్థ పరిస్థితుల్లో అమెరికా వెనిజులా పై తన జులుం ప్రదర్శించింది.

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పదవీచ్యుతి,నిర్బంధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. అమెరికా దౌర్జన్యాన్ని కొన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. కొన్ని దేశాలు ట్రంప్ కు భయపడి గుంభనంగా ఉండిపోయాయి. అమెరికా శత్రు దేశాలతో సహా, కొన్ని మిత్ర దేశాలు,మరికొన్ని నాటో సభ్య దేశాలు ట్రంప్ తీరును తీవ్రంగా తప్పు బడుతున్నాయి.

రష్యా,చైనా,ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా కారకాస్ పై అమెరికా సాగించిన సాయుధ దుస్సాహసాన్ని ప్రపంచ శాంతికి విఘాతం లా పేర్కొన్నాయి. అమెరికాలోని కొంత మంది విపక్ష సభ్యులతో పాటు, స్వపక్షం లోని నేతలు, అమెరికా ప్రజలు ట్రంప్ ను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపారు. అయితే ఇంత తతంగం జరుగుతున్నా, వెనిజులా అమెరికా గుప్పెట్లోకి జారిపోయినా, తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సైతం అమెరికా చెప్పుచేతల్లోనే పని చేసి, అమెరికాకు చమురు దోచి పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నా, వెనిజులా ప్రజలు మాత్రం అమెరికా దాడిని,జరుగుతున్న సంఘటనలను పెద్దగా పట్టించు కోవడం లేదు. పైగా మదురో నిర్బంధం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వీధుల్లోకి వచ్చి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.నియంత పీడ విరగడైనదని ఆనందంతో సంబరాలు జరుపుకుంటున్నారు. ఏమిటీ విచిత్రం? ఎందుకిలా జరుగుతున్నది? అసలు వెనిజులా లో ఏం జరిగింది? ఏం జరగబోతున్నది? వెనిజులా ప్రజలు తమ దేశ సార్వభౌమత్వ పరిరక్షణ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? అనే అంశాలపై సునిశిత పరిశీలన చేసి,విశ్లేషణ జరపడం అవసరం.

**సంపన్న దేశం ఎందుకు చతికిల బడింది?**

నిజానికి అపారమైన చమురు నిల్వలు గల వెనిజులా అత్యంత సంపన్న దేశంగా ఉండాలి. కాని పరిస్థితులు తద్విరుద్ధంగా ఉన్నాయి.వెనిజులా ఆర్థికంగా వెనకబడే ఉంది.కారుచౌకగా చమురు ఎగుమతులు చేయడం వలన ఇతర చమురు సంపన్న దేశాల కంటే,వెనిజులా కు చమురు వలన లభించే ఆదాయం పడిపోయింది.కేవలం చమురు మీద ఆధార పడడం, ఇతర రంగాలను నిర్లక్ష్యం చేయడం చమురు ధరలు తగ్గినప్పుడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. అమెరికా ఆంక్షలు కూడా వెనిజులా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసాయి.ఆదాయం తగ్గి,ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరింది.సౌదీ అరేబియా, అమెరికాల కంటే వెనిజులా అధిక నిరూపిత చమురు నిల్వలు (ప్రోవెన్ ఆయిల్ రిజర్వ్) కలిగి ఉన్నా, ఆదాయం మాత్రం అతి తక్కువగానే ఉంది. "రిచ్ ఇన్ ఆయిల్- పూర్ ఇన్ వెల్తు గా వెనిజులా ఆర్థిక ముఖచిత్రం మారింది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో 10 వ బలమైన ఆర్థిక వ్యవస్థగా బలమైన ఆదాయ వనరులున్న దేశంగా ఎదిగి స్వర్గ ధామంలా విలసిల్లిన వెనిజులా నేడెందుకు దీనంగా మారింది? వెనిజులాలో చమురు వెలికి తీయడం, శుద్ధి చేయడం వంటి ప్రక్రియ ఖరీదైన



వ్యవహారం కావడంతో కార్పోరేట్లు ఈ అవకాశం అంది పుచ్చుకుని దేశాభివృద్ధిలో పాలు పంచుకున్నారు. ఇది నచ్చని అప్పటి వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ చమురు బావులను ప్రైవేటు పెట్టుబడి దారుల నుండి దూరం చేసాడు. పెట్టుబడిదారులను వెళ్ళగొట్టాడు. ప్రజలను ఉచిత పథకాల పేరుతో బిచ్చగాళ్లుగా చేసి, వారిని పని చేయనీయ కుండా సోమరి పోతులుగా మలచి,ఇంటికే పరిమితం చేసి తాను ఆడిందే ఆటగా పాడిందే పాటగా దేశాన్ని ఆర్థికంగా నాశనం చేసి, ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టాడు.సుఖాలకు అలవాటు పడ్డ వెనిజులా ప్రజలు చావెజ్ ను మెచ్చుకుంటూ, కాలక్షేపం చేసారు. దేశం లో ఉత్పాదక శక్తి క్షీణించి పోయింది. పని చేయడం బద్ధకంగా మారింది. అన్ని రంగాలు క్షీణించాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రజలు ఆకలితో అలమటించి, పొట్ట చేత పట్టుకుని దేశం వదలిపోయారు. బలమైన ఆర్థిక వ్యవస్థ అప్పుల పాలైనది. పెట్టుబడులు పెట్టేవారు కరువైనారు. చావెజ్ ప్రజల మానసిక దౌర్భల్యాన్ని ఉచిత పథకాలతో మాయ చేసి తనకు అనుకూలంగా మలచుకుని అధికారం చెలాయించాడు. శ్రమ శక్తిని విచ్ఛిన్నం చేసి, శ్రమించడాన్ని తెలివి తక్కువ తనంగా భావించి, ప్రజలను ఉచితాల విందులో తేలియాడించి , దేశాన్ని అధోగతి పాలు చేసాడు. చివరకు అత్యధిక విలువ గల అతి పెద్ద నోటును వెనిజులా ప్రభుత్వం ముద్రించింది. తిండి పెట్టలేని కరెన్సీ నోట్ల కట్టలను ప్రజలుచెత్త కుప్పల్లో పడేశారు. చావెజ్ మరణానంతరం నికోలస్ మదురో వెనిజులా అధ్యక్షుడై,నియంతగా మారి,ఎన్నికలను బూటకంగా మార్చి, ప్రతిపక్షాలను అణచి వేసి పాలన సాగించాడు.ఉచితాలను మరిగిన ప్రజలు దేశం దివాళా తీయడంతో గగ్గోలు పెట్టారు. దేశంలో ఆకలి కేకలు మిన్నంటాయి. దాదాపు 80 శాతం మందికి పైగా ప్రజలు ఉపాధి లేక,తిండి లేక బ్రెజిల్,కొలంబియా,అర్జెంటీనా దేశాలకు వలస పోయారు. సంపన్న దేశం



పాలకుల అధికార దాహంతో, దూరదృష్టి లేని పాలనతో అడుక్కుతినే పరిస్థితిలోకి నెట్టబడింది. వెనిజులా ఆర్థిక పతనానికి దారితీసిన పాలకుల అనాలోచితమైన ఆర్థిక విధానాల ఘోర వైఫల్యాల ఫలితాన్ని అక్కడి ప్రజలు అనుభవిస్తున్నారు.

**చైనా పెట్టుబడుల వ్యవహారం**

చైనా బిలియన్ల డాలర్ల కొద్దీ వెనిజులా లో పెట్టుబడులు పెట్టింది. వెనిజులా తీసుకున్న అప్పులకు బదులుగా చైనా వెనిజులా నుండి కారుచౌకగా చమురు కొనుగోలు చేస్తున్నది. చమురు క్షేత్రాలపైనే కాకుండా వెనిజులా కు చెందిన పలు రంగాల్లో చైనా పెట్టుబడులు పెట్టింది. అయితే మారిన పరిస్థితుల్లో ఇప్పటి వరకు వెనిజులా తో సత్సంబంధాలు కలిగి, చౌక ధరకు అత్యధికంగా చమురు కొంటున్న చైనా పరిస్థితి ఏంటి? వెనిజులాలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం వలన చైనా వెనిజులా లో పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టడం అసాధ్యం. వెనిజులా పై అమెరికా జరిపిన దాడి వలన, వెనిజులా అమెరికాకు పాదాక్రాంతం కావడం వలన చైనా కు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది.

**వెనిజులా పరిణామాలు భారత్ కు లాభమా? నష్టమా?**

ఒకప్పుడు వెనిజులా నుండి భారత్ భారీ స్థాయిలో చమురు కొనుగోలు చేసింది. కాని వెనిజులా పై అమెరికా ఆంక్షలు విధించడంతో భారత్ వెనిజులా నుండి చమురు దిగుమతులను తగ్గించుకుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో వెనిజులా భారత్ కు చమురు సరఫరా చేస్తుందా? ఇందుకు అమెరికా అంగీకరిస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందా?

**భారత్ పై అమెరికా ఒత్తిడి:-**

ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళు తగ్గించుకున్నా, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి.గయానా నుండి భారత్ భారీగా ఆయిల్ దిగుమతులు జరిపే అవకాశముంది. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో వెనిజులా గనుక భారత్ కు చమురు సరఫరా చేస్తే భారత్ కు మేలు జరుగుతుంది.మరి రష్యా సంగతేంటి? రష్యాతో గల అవినాభావ సంబంధాన్ని భారత్ తెంచుకోగలదా? అందుకు భారత ప్రజలు అంగీకరిస్తారా? అమెరికా దురహంకారం భారత్ కు సంకటం లా మారింది.భారత్ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో డోనాల్డ్ ట్రంప్ రూపంలో భారత్ అనేక క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అమెరికా విధిస్తున్న టారిఫ్ లను తట్టుకుంటూ వేరే మార్గంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ, దేశం ఆర్థికంగా ముందుకు సాగడానికి కృషి చేస్తున్నది. ట్రంప్ భారత్ ను "డెడ్ ఎకానమీ" గా అభివర్ణించినా, పాక్ కు వంతపాడుతూ భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తూన్నా, అమెరికా కంపెనీలు భారత్ లో పెట్టుబడులు పెట్టవద్దని హెచ్చరించినా, భారతీయ విద్యార్ధులపై, ఉద్యోగులపై వీసాల భారం మోపుతూ, భారతీయుల ఉద్యోగాలకు ఎసరు పెట్టాలని చూస్తున్నా ఇంతవరకు భారత్ అమెరికాను గాని ట్రంప్ ను గాని పల్లెత్తు మాట అనకుండా, బలవంతునితో వైరం ప్రమాదకరమన్న రీతిలో సహనం పాటిస్తూ, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం పాటు పడుతున్నది. ప్రపంచం ఒకప్పటిలా గిరిగీసుకుని కూర్చునే పరిస్థితులు లేవు. ప్రతీ దేశానికి ఇతర దేశాలతో అవసరం ఏర్పడింది. వాణిజ్య,సాంకేతిక రక్షణావసరాలు ప్రపంచ దేశాల మనుగడకు అవసరం. అయితే అమెరికా లో ట్రంప్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. తనను వ్యతిరేకిస్తున్న దేశాలతో ఎవరూ సంబంధాలు పెట్టుకోవద్దంటూ ట్రంప్ బెదిరించడం,అందుకు తగ్గట్టుగానే కక్ష సాధింపు చర్యలకు దిగడం వలన భారత్ తో పాటు అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలని ప్రపంచ దేశాలు ఎదురు చూస్తున్నాయి. వెనిజులా దుస్థితి తమకు రాకూడదని చిన్న చితకా దేశాలు మౌనంగా ఉంటున్నాయి.

**ఎవరి దారి వారిదే:**

వెనిజులా విషయంలో అమెరికా ఘోర తప్పిదం చేసిందని అనేక దేశాలు భావిస్తున్నప్పటికీ, బహిరంగంగా ఈ విషయాన్ని చెప్పడానికి భయపడుతున్నాయి.మదురో ను వెంటనే విడుదల చేయాలని రష్యా డిమాండ్ చేసింది. వెనిజులా ను ఆక్రమించాలన్న దురుద్దేశ్యం తమకు లేదని, కేవలం నేరారోపణల పైనే మదురో ను అరెస్టు చేసామని అమెరికా ఒకవైపు చెబుతూనే, వెనిజులా చమురును తమ ప్రత్యర్థి దేశాలకు విక్రయించవద్దని,రష్యా చైనా,ఇరాన్,క్యూబా దేశాలను పక్కన బెట్టాలని అమెరికా హుకుం జారీ చేయడం దేనికి సంకేతం? వెనిజులా లోని తాత్కాలిక అధ్యక్షురాలు అమెరికా కు వంత పాడడం వెనిజులా స్వాతంత్ర్యాన్ని హరించడమే అవుతుంది.

**ట్రంప్ ప్రగల్భాలు:**

టారిఫ్ ల విషయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తనను ప్రాధేయ పడ్డారని, మోడీ తనను సార్ అంటూ కలవడానికి బ్రతిమలాడారని, 8 యుద్ధాలను ఆపిన తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడమేమిటని ట్రంప్ తన ఉక్రోషం వెళ్ళగక్కుతూనే, మరో వైపు యుద్ధాల వైపు ప్రపంచాన్ని పురిగొల్పుతూనే, తాను ఎంతో మంది ప్రాణాలను కాపాడానని చెప్పడం ద్వారా ట్రంప్ తనలో లేని గొప్పదనాన్ని తానే పొగుడుకోవడం హాస్యాస్పదం. డోనాల్డ్ ట్రంప్ లోని భిన్న వైరుధ్యాల మనస్తత్వం, నిలకడ లేని స్వభావం,అహంభావం,బాధ్యతా రాహిత్యం మూడవ ప్రపంచ సంగ్రామానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు. చైనా,రష్యా లు డోనాల్డ్ ట్రంప్ విషయంలో కఠినంగానే వ్యవహరించే అవకాశాలున్నాయి. చైనా,రష్యాలను రెచ్చగొడితే ట్రంప్ తన పతనాన్ని తానే కోరితెచ్చుకున్నట్టే కాగలదు. వెనిజులా విషయంలో అమెరికా పునరాలోచించాలి. వెనిజులా సార్వభౌమత్వాన్ని గౌరవించాలి. వెనిజులా లో అమెరికా పెత్తనం పోవాలి. అంతర్జాతీయ చట్టాలకున్న విలువను పునః ప్రతిష్టించాలి.

-సుంకవల్లి సత్తిరాజు.
మొ:9704903463.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

సూర్య
www.suryaa.com
18.1.2026
ఆదివారం అనుబంధం




ఈ 2026 సంక్రాంతి బరిలో ఉన్న చిట్టచివరి మూవీ ఈ నారీ నారీ నడుమ మురారి. హీరో శర్వానంద్ పెద్దగా ప్రమోషన్స్ ఏం చేయలేదు. అయినా.. ఈ సినిమాపై ఎందుకో అందరికీ హైప్స్ క్రియేట్ అయ్యాయి. ట్రైలర్ కట్ కూడా బాగుంది. మరి ఈ సినిమా అందరి హోప్స్‌ని నిలబెట్టిందో లేదో ఈ రివ్యూలో చూద్దాం.

**కథ :** కార్తిక్ (నరేష్) అనే సింగిల్ ఫాదర్‌కి ఒక్కడే అబ్బాయి గౌతమ్ (శర్వానంద్). కార్తిక్ రెండో పెళ్లికి హెల్ప్ చేస్తూనే తన లవ్‌ను నిత్య (సాక్షి వైద్య)తో సెట్ చేసుకుంటాడు. అయితే.. గౌతమ్‌కు ముందే దియా (సంయుక్త)తో పెళ్లి అవుతుంది. ఆ విషయాన్ని నిత్య దగ్గర దాచిపెడతాడు. నిత్యతో పెళ్లి జరగాలి అంటే దియాతో విడాకులు జరగాలి. నిత్యకు దియా గురించి తెలియకుండా గౌతమ్ ఎలా మేనేజ్ చేశాడు. దియాతో విడాకులు తీసుకోవడానికి ఎలాంటి కష్టాలు పడ్డాడు అనేది సినిమాలో చూపించారు.

**విశ్లేషణ :** సామజవరగమన ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే డైరెక్టర్ అబ్బరాజు ఈ సినిమా చేశాడు. మరి.. సామజవరగమన కంటే ఎక్కువ మార్కులు ఈ నారీ నారీ నడుమ మురారికి పడ్డాయా అంటే.. ఎలాంటి ఆలోచన లేకుండా సింగిల్ వర్డ్‌లో పూర్తి స్థాయిలో పడ్డాయనే చెప్పొచ్చు. సామజవరగమన మూవీకి ఎంతలా నవ్వుకున్నారో అంతకు మించి ఈ సినిమాకు నవ్వుకుంటారు. అంతలా కామెడీ పండించాడు డైరెక్టర్.

ఈ సినిమా గురించి చెప్పుకోవాలంటే.. ముందు డైరెక్టర్ రాసిన కామెడీ డైలాగ్స్ గురించి చెప్పుకోవాలి.

"నిన్ను రాజులా పెంచాను రా నువ్వు వెళ్లి రోజా దగ్గర కూర్చుంటావు అని అనుకోలేదు రా" "నాకు బిలియన్లు తప్ప బిట్ కాయిన్స్ గురించి తెలీదు." "గర్ల్ ఫ్రెండ్ సినిమా చూసి భయం వదిలేయండి అంటే మా ఫ్రెండ్ చున్నీని వదిలేసింది. ఇలాంటి డైలాగ్స్ సినిమాలో కోకొల్లలు. అవి కూడా సరైన సందర్భంలో.. సరైన టైంలో ఉండేలా చూసుకున్నాడు డైరెక్టర్ అబ్బరాజు. అదే సినిమాకు చాలా పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పొచ్చు.

ఇంకో విషయం గురించి చెప్పాలా సినిమా అంటే.. కథ మాత్రమే కాదు. సరైన నటీనటులు కూడా ఉండాలి. ఈ విషయంలో డైరెక్టర్ అబ్బరాజుకు తప్పకుండా వందకు వంద మార్కులు వేయాల్సిందే. సత్య, సుదర్శన్, వెన్నెల కిషోర్, నరేష్, సునీల్.. ఇలా అందరినీ వాడుకున్నవరకు గట్టిగా వాడుకున్నాడు. సందర్భం లేకుండా సత్య వచ్చి నవ్విస్తాడు. నాన్ సింక్ లో వెన్నెల కిషోర్ వచ్చి నవ్విస్తాడు. సీరియస్ టైంలో వచ్చి సునీల్ నవ్విస్తాడు. హీరో పక్కనే ఉండి ఎప్పుడు పడితే అప్పుడు సుదర్శన్ నవ్విస్తాడు. ఇక నవ్వించడానికే ఉన్నట్టు ఉంటుంది సీనియర్ యాక్టర్ నరేష్ పాత్ర.

ఇక కథ అంటారా ఇంత కామెడీ పెట్టిన తర్వాత ఆ కథ గురించి, కథనం గురించి, లాజిక్స్ గురించి అక్కర్లేదు. కామెడీనే మ్యాజిక్ చేసుకుంటూ వెళ్లిపోతుంది. ఇక్కడ నారీ నారీ నడుమ మురారిలో కూడా అదే జరిగింది. ఫస్టాఫ్ అలా కామెడీతో సాగినా.. కొంత మధ్యలో ల్యాగ్ సీన్స్ అనిపించినా ఇంటర్వెల్ తో సెట్ అయింది. ఇంటర్వెల్ తర్వాత డైరెక్టర్ ఎక్కడా తగ్గలేదు. సినిమాలో కనిపించే పాత్రలు ఎక్కడా తగ్గలేదు. నాన్ స్టాప్ కామెడీ సీన్స్తో థియేటర్ లో ఉన్న ఆడియన్స్ నుంచి నాన్ స్టాప్ నవ్వులు. లాస్ట్ లో ఎమోషనల్ టచ్ కూడా బానే సెట్ చేశాడు. మొత్తంగా సంక్రాంతికి సరైన సినిమా అనేలా ఉందని చెప్పొచ్చు. ఫ్యామిలీ ఆడియన్స్ కి బానే కనెక్ట్ అవుతుంది. సినిమా చూసి కొన్ని రోజుల క్రితం 12 నిమిషాలు కట్ చేశారట. ఇప్పుడు సినిమా చూసిన తర్వాత మూవీ టీం అండ్ ఎడిటింగ్ టీం ఎంత పక్కాగా ఉన్నారో అర్థమవుతుంది.

హీరో శర్వానంద్ తన ఈజ్‌తో నటించాడు. హీరోయిన్లు సాక్షి వైద్య, సంయుక్త కూడా బానే చేశారు. మిగితా పాత్రల గురించి పైన ఇప్పటికే చెప్పుకున్నాం..

**ప్లస్ పాయింట్స్ :** కామెడీ డైలాగ్స్. హీరో శర్వానంద్. నరేష్, సత్య, వెన్నెల కిషోర్, సుదర్శన్, సునీల్. సెకండాఫ్ మొత్తం.

**మైనస్ పాయింట్స్ :** బ్రేకప్ సాంగ్

మొత్తంగా "సంక్రాంతికి ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా నవ్వుకునే 'మురారి' సందడి."

---




నవీన్ పొలిశెట్టి అన్న వెంటనే జాతిరత్నాలు అనే సినిమా గుర్తువస్తుంది అందరికీ. దీని తర్వాత వచ్చిన మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి పెద్దగా ఆకట్టుకోలేదు. మళ్లీ ఇప్పుడు 3 ఏళ్ల గ్యాప్ తర్వాత అనగనగా ఒక రాజు అనే అవుట్ అండ్ అవుట్ కామెడీ మూవీతో వచ్చాడు. హీరోగానే కాదూ ఈ సినిమాకు డైలాగ్స్ అండ్ స్క్రీన్ రైటర్‌గా కూడా చేశాడు పొలిశెట్టి. మరి ఈ సినిమా ఎలా ఉందో ఈ రివ్యూలో చూద్దాం.

**కథ.** గోదావరి జిల్లాల్లో మంచి పేరున్న జమిందారు గోపయ్య రాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). చెప్పుకోవడానికి ఇంత పెద్ద పేరున్నా.. అనుభవించడానికి ఆస్తులేమీ ఉండవు. కానీ, ఊరులో జమిందారుగానే ఉంటాడు రాజు. అయితే ఓ సారి తన ఫ్రెండ్ బాగా డబ్బున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో ఒక్క సారిగా రిచ్ అయిపోతాడు. అక్కడ రాజుకు అవమానం కూడా జరుగుతుంది. దీని తర్వాత ఎలాగైనా బాగా డబ్బున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అలా చారులత (మీనాక్షీ చౌదరి)ని కలుస్తాడు. మరి చారులతతో రాజు పెళ్లి ఎలా జరుగుతుంది? పెళ్లి తర్వాత రాజు ఎలాంటి ఛాలెంజ్‌లను ఫేస్ చేస్తాడు అనేది మిగతా కథ.

**విశ్లేషణ :** అనగనగా ఒక రాజు.. ఈ మూవీ నవీన్ పొలిశెట్టి కోసమే రాసుకున్నట్టు ఉంటుంది. స్వయంగా మంచి రైటర్ కాబట్టి నవీన్ పొలిశెట్టి తన పాత్ర కోసం సరైన కామెడీ డైలాగ్స్ రాసుకున్నాడు. సినిమాకు అవే ప్లస్ పాయింట్స్ అయ్యాయి. ఈ సినిమాలో నవీన్‌ను కాకుండా ఎవరినీ ఊహించుకోలేం. అలా యాక్ట్ చేశాడా అలాంటి డైలాగ్స్ రాసుకున్నాడు.

సినిమా అంటే కథ గురించి చెప్పాలి కానీ, నవీన్ గురించి, ఆయన కామెడీ డైలాగ్స్ గురించి చెబుతున్నారేంటి అనుకుంటున్నారా నిజానికి సినిమాలో కథ గురించి గానీ, కథనం గురించి గానీ, పెద్దగా చెప్పుకోవడానికి ఏం లేదు. మొత్తం నవీన్ పొలిశెట్టి ఉన్నాడు. నవీన్ పొలిశెట్టి కనిపిస్తాడు. అంతా ఓ స్వాగ్‌లో వెళ్లిపోతుంది.

ఎలాగైనా సినిమా చూడటానికి వచ్చిన ఆడియన్స్‌ను నవ్వించాలని అనుకున్నారు. అందులో చాలా వరకు సక్సెస్ అయ్యారు. అయితే కొన్ని ఫోర్స్‌గా పెట్టిన కామెడీ సీన్స్ పెద్దగా అనిపించకపోయినా పొలిశెట్టి స్వాగ్ వల్ల నడిచిపోయాయి.

అయితే, ఈ సినిమా చూస్తున్నంత సేపు పిల్లా జమిందార్ లాంటి కొన్ని సినిమాలు మన కళ్ల ముందుకు వచ్చి పడతాయి. అది కాస్త మైనస్ అనుకోవచ్చు. అలాగే, ఫస్టాఫ్‌లో కూడా కొన్ని సీన్స్ ల్యాగ్ గానే ఉన్నాయి. హీరోయిన్‌ను హీరో ప్రేమలో పడేసే చాలా వరకు సీన్స్ వర్కౌట్ అయినా కొన్ని సీన్స్ మాత్రం ఆడియన్స్‌కు పరీక్ష పెట్టేలా ఉంటాయి. ఇంటర్వెల్ దగ్గర ఓ మెయిన్ ట్విస్ట్ పెట్టి బ్రేక్ ఇచ్చాడు. ఇంటర్వెల్ టైంలో వచ్చిన ఇంట్రెస్ట్‌ను సెకండాఫ్‌లో బానే కంటిన్యూ చేశాడు. తర్వాత పొలిటికల్ టచ్ ఇస్తూ జానర్ మార్చినట్టు మార్చినా ఆడియన్ కనెక్టివ్ గానే ఉంటాడు. ప్రీ క్లైమాక్స్ దగ్గర మళ్లీ ఫ్లో కాస్త తగ్గింది. అలాగే రెగ్యులర్ క్లైమాక్స్ కొంత వరకు మైనస్. ఇంకాస్త బెటర్‌గా ప్లాన్ చేస్తే బాగుండేది. అయితే నవీన్ పొలిశెట్టి తన కెరీర్ చేసిన ఫస్ట్ ఫైట్ వరకు ఒకే.

నవీన్ పొలిశెట్టి పెర్ఫార్మెన్స్ గురించి పైనే చెప్పాం. నవీన్ వన్ మెన్ షో చేశాడు. మీనాక్షీ లుక్స్ బాగున్నాయి. సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లి రాజు వచ్చిన కాసేపు నవ్వులు పండించాడు. చమ్మక్ చంద్ర, భద్రం, జబర్దస్త్ ఫేం మహేష్ పర్వాలేదు అనిపించారు. రావు రమేష్ పాత్ర ఉన్నా పెద్దగా లేనట్టే. అయితే ఉన్నవరకు అయితే బానే చేశాడు.

**ఇక సాంకేతిక విభాగం గురించి అంటే :** మ్యూజిక్ బాగుంది. ఫస్టాఫ్‌లో కొన్ని, ప్రీ క్లైమాక్స్‌లో కొన్ని ల్యాగ్ సీన్స్‌పై ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్ ఇంకాస్త వర్క్ చేసి ఉంటే బాగుండేది. కెమెరా వర్క్ బాగుంది. నిర్మాణ విలువలు పర్లేదు.

**ప్లస్ పాయింట్స్ :** నవీన్ పొలిశెట్టి, కామెడీ డైలాగ్స్, ఇంటర్వెల్

**మైనస్ పాయింట్స్ :** కొన్ని ల్యాగ్ సీన్స్, అంచనా వేయగల స్టోరీ

**మొత్తంగా** నాన్-స్టాప్ సింగిల్ లైన్ డైలాగ్స్ జాతర: లాజిక్కులు పక్కన పెడితే, థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకుడు నవ్వుకుని వచ్చే "కంప్లీట్ ఫ్యామిలీ ప్యాకేజీ".

---




భోళా శంకర్ వంటి అల్ట్రా డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర చేశారు. అది బిజినెస్ అవ్వక రిలీజ్ కి నోచుకోలేదు. దీంతో హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర్ వరప్రసాద్ గారు' అనే ఫ్యామిలీ అండ్ మాస్ ఎంటర్టైనర్ చేశారు. ఇది హిట్ అయితే విశ్వంభర సినిమాకి కూడా మంచి బిజినెస్ జరిగి రిలీజ్ చేసుకోవచ్చు అనేది చిరు ప్లాన్. మరి ఆయన స్కెచ్ ఎంత వరకు వర్కౌట్ అయ్యిందో ఈ రివ్యూలో చూద్దాం.

**కథ :** శంకర వర ప్రసాద్( చిరంజీవి) ప్రధాన మంత్రి దగ్గర పనిచేసే నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. ఎంత పెద్ద ప్రమాదం వచ్చినా ఎదురెళ్లి ఫైట్ చేసి.. తనను నమ్ముకున్న వాళ్లను కాపాడుకుంటాడు. అయితే అతని మనసులో ఒక బాధ ఉంటుంది. అదే అతని ఫ్యామిలీ లైఫ్ డిస్టర్బ్ అవ్వడం. భార్య శశిరేఖ( నయనతార) శంకర్ కి విడాకులు ఇచ్చేసి.. పిల్లలకి కూడా అతన్ని దూరం చేస్తుంది. దీంతో అతను తన తల్లి దగ్గరే ఉంటాడు.వీళ్లిద్దరూ విడిపోవడానికి కారణం అతని మామగారు జీవీఆర్( సచిన్ కేడేకర్). ఒకరోజు అనుకోకుండా జీవీఆర్ పై పెద్ద ఎటాక్ జరుగుతుంది. దీంతో హై ఎండ్ సెక్యూరిటీ కావాలని సెంట్రల్ గవర్నమెంట్ ని రిక్వెస్ట్ చేస్తుంది శశిరేఖ. దీంతో శంకర్ వరప్రసాద్ అండ్ టీమ్ ను అపాయింట్ చేస్తుంది కేంద్ర ప్రభుత్వం. అసలు శంకర్ ప్రసాద్, శశిరేఖ ఎందుకు విడిపోయారు.? జీవీఆర్ పై ఎటాక్ చేసింది ఎవరు? చివరికి శశి , శంకర్ కలిసారా? ఈ ప్రశ్నలకి సమాధానమే మిగిలిన సినిమా.

**విశ్లేషణ :** దర్శకుడు అనిల్ రావిపూడికి ఒక సెపరేట్ స్టైల్ ఉంటుంది. అలా అని హీరో ఇమేజ్ ని సైడ్ ట్రాక్ చేయడు. హీరోకి ఉన్న ప్లస్సులను తీసుకుని తన మార్క్ తో కథ అల్లడం అతనికి అలవాటు. మన శంకర వరప్రసాద్ విషయంలో కూడా అతను చేసింది అదే. చిరుకి భీభత్సమైన కామెడీ టైమింగ్ ఉంది. చంటబ్బాయ్ వంటి సినిమాలకి చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. దానినే మన శంకర వరప్రసాద్ లో వాడుకున్నాడు. అలా అని చిరు మాస్ ఇమేజ్ ను సైడ్ చేయలేదు. కాకపోతే ఇలాంటి కథ గతంలో చిరు చేయలేదా? అంటే చేశారు అని నిస్సందేహంగా చెప్పొచ్చు. డాడీ కథనే అటు తిప్పి .. ఇటు తిప్పి తీశాడు. వాస్తవానికి అదే కథతో వెంకటేష్ తులసి చేశాడు, అజిత్ విశ్వాసం కూడా చేశాడు. ఆ 3 కలిపితే మన శంకర వరప్రసాద్ గారు అనడంలో సందేహం లేదు. ఫస్ట్ హాఫ్ లెంగ్త్ గానే ఉంది. ఒకదశలో జబర్దస్త్ లో గెటప్ శీను చిరు స్కిట్లు చేస్తున్నాడు అనే ఫీలింగ్ కలిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. అయితే సెకండాఫ్ లో కొన్ని సీన్లు వర్కౌట్ అయ్యాయి. ముఖ్యంగా హీరో తల్లి .. కోడలితో ఆప్యాయంగా మాట్లాడుతూ భార్యాభర్తల బంధం గురించి చెప్పే సన్నివేశాన్ని అనిల్ బాగా రాసుకున్నాడు.సినిమాని సేఫ్ చేసింది ఆ సీనే అనిపించొచ్చు కూడా . ఆ తర్వాత స్క్రీన్ ప్లే డల్ అవ్వకుండా వెంకటేష్ ను దించారు. క్లైమాక్స్ బోర్ కొట్టకుండా వెళ్ళిపోయింది.


**నటీనటులు విషయానికి వస్తే..** చిరు లుక్స్ ఈ మధ్యకాలంలో బెటర్ గా ఉన్నది ఈ సినిమాలోనే. నయనతార విశ్వాసం, తులసి సినిమాలో చేసిన పాత్రనే ఈ సినిమాలో కూడా చేసింది. సచిన్ కేడేకర్ తన స్థాయికి తగ్గ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. వెంకీ కేమియో ఓకే. కేథరిన్, హర్షవర్ధన్, అభినవ్ గోమటం వంటి వాళ్లు కొంత కామెడీ పండించారు.

**ప్లస్ పాయింట్స్ :** చిరు కామెడీ ఎ గ్రేస్, పర్వాలేదు అనిపించే ఫస్టాఫ్, మ్యూజిక్ ఎ పాటలు ఎ డ్యాన్స్

**మైనస్ పాయింట్స్ :** రన్ టైమ్, రొటీన్ సెకండాఫ్, సాగదీసే కామెడీ సీన్స్, ఇంపాక్ట్ చేయని వెంకీ క్యామియో

**మొత్తంగా** ' మన శంకర వరప్రసాద్ గారు ' .. పండక్కి ఫ్యామిలీస్ ఎంజాయ్ చేసే అవకాశం ఉంది. జస్ట్ ఒకే.

---



రవితేజ హిట్టు కొట్టి 4 ఏళ్ళు అవుతుంది. 'ధమాకా' తర్వాత వచ్చిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. అయితే ఈ సంక్రాంతికి ఒక ఫ్యామిలీ సినిమాతో వచ్చాడు. మరి దీంతో అయినా హిట్టు కొట్టాడా? లేదా? అనేది ఈ రివ్యూ ద్వారా తెలుసుకుందాం

**కథ:** రామ్ అలియాస్ రామ సత్యనారాయణ(రవితేజ) ఓ పెద్ద బిజినెస్ మెన్. కానీ అతను చేసే బిజినెస్ ఏదేదో అనుకోకండి.. అతను ఒక ఆల్కహాల్ కంపెనీకి ఓనర్. ఒకసారి అతను అనార్కలి అనే కొత్త వైన్ తయారు చేసి దానికి ఇంటర్నేషనల్ లెవెల్లో దానికి అటెన్షన్ తేవాలి అనుకుంటాడు. ఈ క్రమంలో స్పెయిన్ లో ఉన్న ఒక కంపెనీతో కొలాబరేట్ అవుదామని ప్రయత్నిస్తాడు. కానీ అందుకు ఆ కంపెనీ వాళ్ళు ఒప్పుకోరు. అతని ప్రపోజల్ ని రిజెక్ట్ చేస్తారు. అలా ఎందుకు జరిగిందో తెలుసుకుందామని రామ్ తన మేనేజర్ లీలా(వెన్నెల కిషోర్) ని తీసుకుని స్పెయిన్ కి వెళ్తాడు.అక్కడ ఆల్కహాల్ కంపెనీ ఎం.డి అయినటువంటి మానస(ఆషిక రంగనాథ్)ని కలుస్తాడు. రామ్ ఆల్కహాల్ ని రిజెక్ట్ చేసింది మానస మేనేజర్ బెల్లం(సత్య) అని తెలుస్తుంది. అతనికి బుద్ధి చెప్పి రామ్‌కి దగ్గరవుతుంది మానస. ఊహించని విధంగా వీళ్ళు ఫిజికల్ గా దగ్గరవుతారు. అయితే రామ్ కి పెళ్ళైంది అనే విషయం తెలిక అతనికి మనసిచ్చేస్తుంది మానస. అటు తర్వాత రామ్ ఇండియాకి వచ్చేసి తన భార్య బాలా మణి(డింపుల్ హయాతి) వద్ద ఎప్పటిలానే ఫ్యామిలీ లైఫ్ ని ఎంజాయ్ చేస్తుంటాడు. కానీ మానస మాత్రం రామ్ కోసం ఇండియా వచ్చేస్తుంది. తర్వాత రామ్ కి పెళ్ళైంది అనే విషయం ఆమెకు తెలుస్తుంది. అటు తర్వాత మానసతో రామ్ వ్యవహారం బాలామణికి కూడా తెలుస్తుంది. అటు తర్వాత ఏం జరిగింది? ఈ మధ్యలో రామ్ కి ఎదురైన సమస్యలు ఏంటి? ఈ ప్రశ్నలకి సమాధానమే మిగిలిన సినిమా

**విశ్లేషణ :** దర్శకుడు కిషోర్ తిరుమల ఫ్యామిలీ సినిమాలు తీయడంలో ఎక్స్పర్ట్. కాక పోతే అతనికో సమస్య ఉంది. ఫస్ట్ హాఫ్ ని మంచి ఎంటర్టైన్మెంట్ తో నింపేస్తాడు. దీంతో సెకండాఫ్ కూడా అదే రేంజ్లో ఉంటుంది అని ప్రేక్షకుడు ఆశపడతాడు. కానీ సెకండాఫ్‌ని సాగదీసేసి ఆడియన్స్ కి చిరాకు తెప్పించేస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కిషోర్ తిరుమలకి సెకండాఫ్ సిండ్రోమ్ ఉందనుకోవచ్చు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా విషయంలో కూడా ఇదే రిపీట్ అయ్యింది. ఫస్ట్ హాఫ్ సింపుల్ గా మొదలైనా సత్య కామెడీ ఆకట్టుకుంటుంది. స్క్రీన్ ప్లే పరుగులు పెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. ఇంటర్వెల్ కి సెకండాఫ్ పై ఆసక్తి పెరుగుతుంది. కానీ సెకండాఫ్ లో అటు భార్యకి ఇటు ప్రియురాలికి మధ్య నలిగిపోయే భర్త పాత్రలో హీరో ఇబ్బంది పడటం.. ఈ క్రమంలో వచ్చే వెన్నెల కిషోర్, సునీల్..ల కామెడీ, సీరియల్ సాంగ్స్ కి డాన్స్ వేయడం వంటివి బాగానే ఉంటాయి.. కానీ ఒక్కటే సీన్ రిపీటెడ్ గా వస్తున్న ఫీలింగ్ కలిగిస్తాయి. బేసిగ్గా కిషోర్ తిరుమల మంచి రైటర్. చాలా చోట్ల పంచ్ డైలాగులు బాగా పేలాయి. అందువల్ల క్లైమాక్స్ ని సెన్సిబుల్ గా డీల్ చేస్తాడేమో అని అంతా ఆశిస్తారు. కానీ క్లైమాక్స్ ని కూడా అతను సాగదీసి ఆడియన్స్ కి ఇక చాల్లే అనే ఫీలింగ్ తెప్పించాడు. రన్ టైం కూడా తక్కువగా ఉండటంతో 'ఇట్స్ ఓకే' అంటూ ప్రేక్షకుడు థియేటర్ ను బయటకు వచ్చేస్తాడు.

**నటీనటుల విషయానికి వస్తే..** రవితేజ ఈ సినిమాలో హీరో. అతనికి ఈ పాత్ర కొత్తదేమో.. ఈ సినిమాకి అతని ఇమేజ్ మార్కెట్ పరంగా హెల్ప్ చేస్తుందేమో..! అంతే తప్ప అతని ఎనర్జీ లెవెల్స్ పూర్తిగా మిస్ అయిన సినిమా ఇది. గతంలో రవితేజ చేసిన 'సారొచ్చారు' లో కూడా ఎనర్జీ లెవెల్స్ కనిపించవు. మళ్ళీ 14 ఏళ్ళ తర్వాత అలాంటి పాత్రనే రవితేజ చేశాడు అనుకోవాలి. ఆషిక రంగనాథ్ గ్లామర్ పరంగా ఫుల్ మార్క్స్ కొట్టేసింది. డింపుల్ హయాతి ఎందుకో ఈ పాత్రకి సెట్ అవ్వలేదు. కానీ 'వామ్మో వాయ్యో' సాంగ్ లో మాత్రం డాన్స్ ఇరకొట్టేసింది. సత్య, వెన్నెల కిషోర్, సునీల్, మురళీధర్ గౌడ్.. డౌట్ లేకుండా ఈ సినిమాకి సేవియర్స్ వాళ్ళే అనడంలో సందేహం లేదు.

**ప్లస్ పాయింట్స్ :** కామెడీ డైలాగ్స్, రవితేజ, ప్రొడక్షన్ వాల్యూస్

**మైనస్ పాయింట్స్ :** స్టోరీ, స్క్రీన్ ప్లే, సెకండాఫ్, అవసరం లేని స్పూఫ్‌లు ముఖం మీద నవ్వు.. గుండె మీద భారం..

సూర్య www.suryaa.com
18.1.2026



# ద్వాదశరాశి ఫలములు (వార ఫలాలు)

## 18.1.2026 నుంచి 24.1.2026 వరకు

గమనిక: గోచారఫలాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు

### మేషరాశి

అశ్విని 1,2,3,4 పాదములు - భరణి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో తల్లితండ్రులతో మం చి అనుబంధాన్ని పెంపొందించుకుంటారు. నూతన వస్త్రాలు, షాపింగ్ లు ఆనందాన్ని స్థాయి. తండ్రి ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు.అధిక శ్రమతో ప్రత్యర్థుల మీద విజయం సాధిస్తారు. పూర్వపు రుణములు పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాలు, గృహ వాతావరణం అనుకూలంగా ఉం టాయి. మధ్యలో వృత్తిపరమైన విషయాలలో ఉన్నతాధికారులు, మీపై సిబ్బంది అనుకూలంగా ఉంటారు, సహకారం అందిస్తారు. సాంఘిక సంబంధాలు గౌరవం అనుకూలం. ఆత్మీయులైన మిత్రులతో, తోబుట్టువులతో కమ్యూనికేషన్ అనుకూలంగా ఉంటుంది, విద్యార్థులు మంచి ఫలితాలు పొందడానికి అవకాశం ఉంది, అయినప్పటికీ అన్ని విషయాలలో శ్రద్ధ అవసరం. ముఖ్యంగా డ్రైవింగ్ చేసేవారు జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. మీరు వృత్తి చేసే ప్రదేశాలలో గాసిప్స్ కి దూరంగా ఉండటం అవసరం.వ్యాపార భాగస్వామ్య వ్యవహారాలలో, జీవిత భాగస్వామి ఆరోగ్యంలో తగిన శ్రద్ధ

### వృషభరాశి

కృతిక 2,3,4 పాదములు - రోహిణి 1,2,3,4

వారం ప్రారంభంలో వృత్తిపరమైన ప్రదేశాలలో అనవసరమైన వ్యక్తులతో ప్రశాంతత తక్కువ. వ్యక్తిగత ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. మానసిక చికాకుల అధికంగా ఉంటాయి, తల్లి, సంతానం వారి ఆరోగ్యం అభివృద్ధి కొరకు దృష్టి సారిస్తారు. ఉపాసన బలాన్ని పెంపొందించుకోవాలి. మధ్యలో తండ్రి పెద్దలు మొదలైనవారి ఆశీస్సులు కోరుకుంటారు. ముఖ్యంగా వారితో అభిప్రాయ బేధాలకు దూరంగా ఉండాలి. ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసే వారికి సరియైన ప్రణాళిక అవసరం. అయినప్పటికీ వారాంతంలో పెద్దల సహకారం, ఉన్నత విద్య, ఆర్థిక అంశాలు చాలా చక్కగా అను కూలిస్తాయి. తండ్రి ఆరోగ్యం, సహకారం వారితో మీ అనుబంధం అనుకూలం.వృత్తిలో అధిక శ్రమ ఉన్నప్పటికీ మీ గౌరవం పెరుగుతుంది. మంచి నిర్ణయాలు తీసుకుంటారు. ఆలోచనలు వికసిస్తాయి. ఆగుతూ వచ్చిన పనులు కొంతమేర ముందుకు వెళతాయి. గృహ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

### మిథునరాశి

మృగశిర 3,4 పాదములు - ఆరుద్ర 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సంఘములో ఉన్నత స్థాయి పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారంతో కీర్తి ప్రతిష్టలు పెంపొందించుకుంటారు. సాంఘిక సంబంధాలు అనుకూలంగా ఉంటాయి, భాగస్వామ్య వ్యవహారాల గురించి శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులకు విద్యాపరమైన నైపుణ్యముపై, ముఖ్యంగా గణితము పై శ్రద్ధ వహించాలి. కమ్యూనికేషన్ విషయంలో తగిన శ్రద్ధ అవసరం. ఆర్థిక విషయాలను అనుకూలంగా ఉంటాయి. విందు వినోదాల్లో పాల్గొంటారు. వారము మధ్యలో తండ్రితో, ఋణము తీసుకున్న వారితో అభిప్రాయ భేదాలకు దూరంగా ఉండాలి. ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసేవారు అధిక శ్రమతో అనుకున్న ఫలితాలు సాధిస్తారు. ఆరోగ్య విషయంపై చాల శ్రద్ధ తీసుకోవాలి, మానసిక ఉద్వేగాన్ని అధిగమించాలి. వారం చివరిలో కుటుంబంలోని పెద్దలు, గురువుల సహకారంతో మంచి నిర్ణయాలు తీసుకుంటారు.

### కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము - పుష్యమి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో, నిత్యజీవితంలో దినచర్యను మార్పులు చేసుకుంటారు. కొత్త హాబీలు మీద దృష్టి పెడతారు. ఆరోగ్య విషయాల మీద శ్రద్ధ తీసుకుంటారు, రుణాలను పూర్తిచేస్తారు, రోగనిరోధక శక్తిని పెంపొందించుకుంటూ కుటుంబ వ్యక్తులతో గృహ వాతావరణంలో అసౌకర్యాన్ని అధిగమించాలి, డ్రైవింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. సంతాన వర్గం యొక్క ఆరోగ్యం మీద శ్రద్ధ వహిస్తారు. వారం మధ్యలో నూతన ప్రదేశాలలో ఆహార స్వీకరణ వలన ఆరోగ్య విషయాలు, పని ఒత్తిడి ఇబ్బంది కలిగిస్తాయి. దగ్గర ప్రయాణాలు మీద ఆసక్తి, ఆత్మవిశ్వాసం తగ్గడం. భాగస్వామ్య వ్యవహారాలలో అభిప్రాయ బేధాలుకు దూరంగా ఉండాలి. వారాంతంలో మ్యూనికేషన్ విషయంలో ముఖ్యముగ తండ్రి, పెద్దలు, గురువులు మొదలైన వారిని సంప్రదించి వారి సలహాలతో ముందుకు వెళ్లేటప్పుడు అధిక ఉద్వేగాలను అధిగమించాలి.

### సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు - పుబ్బ 1,2,3,4

వారం ప్రారంభంలో ప్రత్యర్థుల మీద విజయం సాధించడానికి అధిక శ్రమతో విద్యార్థులు ముందుకు పెడతారు. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తగవు సంఘంలో గుర్తింపు పలుకుబడి కలిగిన వ్యక్తులతో ముఖ్య వ్యవహారాలు కొరకు, సంతాన అభివృద్ధి విషయంలో సలహా సంప్రదింపులు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంపొందించుకోవడానికి ఆధ్యాత్మిక సందర్శనలు ఆనందాన్ని ఇస్తాయి. ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. ప్రియమైన వ్యక్తులతో, బంధువులతో అభిప్రా బేధాలుకు దూరంగా ఉండాలి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ తీసుకుంటారు. కమ్యూనికేషన్ సరి చూసుకోవాలి. వారాంతంలో వృత్తిలో శ్రమ అధికం ఉంటుంది గౌరవం పెరుగుతుంది. ఆర్థిక, కుటుంబ వ్యవహారాలు ఘర్షణాత్మకంగా ఉంటాయి. స్థిరాస్తులు కొనుగోలు మొదలైన విషయాలలో రుణములప్రయత్నాలు చేస్తారు. ఉన్నత స్థాయి వ్యక్తులతో ఆచితూచి వ్యవహరించడం మంచిది.

### కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు - హస్త 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో కుటుంబ సభ్యులతో, ఆర్థిక విషయాలలో, మాట పట్టింపులు. ముఖ్యంగా సంతాన వర్గంతో, స్త్రీలతో వాదములకు దూరంగా ఉండాలి. గృహ వాతావరణం ఘర్షణాత్మకంగా అ సౌకర్యంగా ఉంటుంది. ఆరోగ్య విషయములో తగినశ్రద్ధ తీసుకుంటారు. వారము మధ్యలోఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెంచుకుంటారు. ఆధ్యాత్మిక సంబంధ ఖర్చులు అధికం చేస్తారు. మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. సంతాన వర్గం అభివృద్ధి కొరకు, వృత్తిపరమైన విషయాలలోనూ ఘర్షణగా ఉంటుంది. వారం చివరిలో ముఖ్యమైన పనులు ఆలస్యాలు ఆటంకాలు ఇబ్బంది కలిగిస్తాయి. కోపాన్ని నియంత్రించుకోవాలి. దినచర్యలో మార్పులు చేసుకుంటారు. సాంఘిక సంబంధాల్లో, కుటుంబ అంశాలలో, భాగస్వామి ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలతో ముందుకెళ్లాలి.

### తులారాశి

చిత్త 3,4 పాదములు - స్వాతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో నెట్వర్క్ పెంపొందించు కుంటారు. కమ్యూనికేషన్ విషయంలో తగిన జాగ్రత్తలతో వెళ్ళాలి. దగ్గర ప్రయాణాలకు అవకాశం. సహకారాన్ని కోరుకుంటారు, పట్టుదలతో అనుకున్న పనులు ప్రయత్నంతో సాధిస్తారు. సంతాన వర్గ అభివృద్ధి కొరకు, నూతన పెట్టుబడుల కొరకు నిర్ణయాలు తీసుకుంటారు. వారం మధ్యలో తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ వారి కొరకు ధనాన్ని ఖర్చు చేస్తారు. వ్యక్తిగత ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలి. వృత్తిలో అధిక శ్రమ. సమయానికి ఆహార స్వీకరణ, కంటికి తగిన విశ్రాంతి అవసరం. గృహ వాహన విషయాలలో మార్పులు కొరకు ఆలోచన చేస్తారు. గృహ సౌఖ్యం తక్కువ. అయినప్పటికీ వారాంతంలో ఏర్పడే మార్పుల వల్ల గృహ వాహన విషయాలు, రుణముల కొరకు చేసే ప్రయత్నాలు, అనుకూలం. మానసిక ప్రశాంతత, ధైర్యం పెరుగుతుంది. తోబుట్టువులతో వివాదాలకు దూరంగా ఉండాలి.

### వృశ్చిక రాశి

విశాఖ 4వ పాదము - అనూరాధ 1,2,3,4

వారం ప్రారంభంలో వారసత్వపు ఆస్తులు విషయంలో తోబుట్టువులతో చర్చలకు అవకాశం, అభిప్రాయ బేధాల విషయంలో దూరంగా ఉండాలి. ప్రయాణాలకు అవకాశం ఆర్థిక విషయాలు కుటుంబ అంశాలు అనుకూలంగా ఉంటాయి. ఎదురుచూస్తున్న వర్తమానాలు అందుకుంటారు. నెట్వర్క్ ను పెంపొందించుకుంటారు. కుటుంబానికి బంధువులు రాక. స్థిరాస్సులు కొనుగోలు కొరకు ప్రయత్నాలు చేస్తారు. గృహ వాహన విషయాలలో మార్పుల కొరకు కుటుంబములోని ముఖ్యులతో సంప్రదించి మంచి నిర్ణయాలు తీసుకుంటారు. వారం మధ్యలో మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలి. గవర్నమెంట్ లోన్ కొరకు ప్రయత్నాలు చేస్తారు. వారం చివరిలో తల్లి ఆరోగ్యం అనుకూలంగా ఉంటుంది. విద్యార్థులకు అనుకూలమైన సమయం, సమయాన్ని సరియైన విధంగా సద్వినియోగపరచుకొని మంచి ప్రణాళికతో ముందుకు వెళితే అనుకున్న ఫలితాలు సాధించగలరు.

### ధనస్సు రాశి

మూలా 1,2,3,4 పాదములు - పూర్వాషాఢ 1,2,3,4 పాదములు - ఉత్తరాషాఢ 1వ

వారం ప్రారంభంలోమానసిక ఉల్లాసం ఉత్సాహంగా నిర్ణయాలు తీసుకుంటారు. ప్రత్యర్థుల మీద విజయం సాధిస్తారు. వృత్తిపరమైన విషయంలో అధిక శ్రమ అలసట అధికంగా ఉంటాయి, అయినప్పటికీ నిర్ణయి సామర్థ్యం పెరుగుతుంది వ్యక్తుల సహకారం కొంత అనుకూలంగా ఉంటుంది. ఆర్థికంగా, వృత్తిపరంగా ఉన్నత స్థాయి వ్యక్తుల యొక్క సహకారం మిశ్రమం. సృజన త్మక నిర్ణయాలతో వృత్తిలో మీ క్రింది వ్యక్తుల సహకారంతో కొత్త మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక ఆలోచనలు అనుకూలంగా ఉంటాయి. మాటలు విషయంలో, కమ్యూనికేషన్ లోనూ తగిన జాగ్రత్తతో ముందుకు వెళ్లాలి. ఆర్థిక సంబంధమైన అంశాలలో భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు, ఘర్షణకి అవకాశం ఇవ్వరాదు. వారం చివరిలో పట్టుదల, సామర్థ్యాలు పెరుగుతాయి. అనుకోని వ్యక్తుల సహకారం, రుణములు తీర్చ గలుగుతారు.

### మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు - శ్రవణం 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పుణ్య కార్యక్రమాలు కొరకు ధనాన్ని ఖర్చు చేస్తారు. ప్రశాంతత తక్కువగా ఉంటుంది. మధ్యలో ఆత్మవిశ్వాసం తగ్గుతుంది, అధిక ఒత్తిడి శ్రమ, నిద్రలేమి అధికంగా ఉంటాయి. కుటుంబ విషయాలలో, సంతాన వర్గం యొక్క అభివృద్ధివిషయంలో మానసిక చికాకులు. అయినప్పటికీ వారాంతములో నూతన ఉత్సాహంతో, కొత్త నిర్ణయాలతో, ధైర్యంగా, ప్రత్యర్థుల మీద విజయం సాధిస్తూ, స్థిరాస్తులు విషయంలో మంచి ఆలోచనలు చేస్తూ ముందుకు వెళ్ళగలుగుతారు. కంటి ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. వారాంతంలో కమ్యూనికేషన్ విషయంలో, స్థిర ఆస్తులు అంశాలలో తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. కుటుంబ సంబంధమైన విషయాల కొరకు, భాగస్వామితో షాపింగులు, ప్రయాణాలు మొదలైన వాని కొరకు, విందు వినోదాలలో పాల్గొనుట కొరకు ధనాన్ని ఖర్చు చేస్తారు.

### కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు - శతభిషం 1,2,3,4

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అలసట పని ఒత్తిడి అధికంగా ఉండటం వల్ల ప్రశాంతత తక్కువ, నిద్రలేమి ఇబ్బంది పడతాయి. ప్రయాణాల కొరకు, వ్యక్తిగత విషయాల కొరకు అధిక ఖర్చులు చేస్తారు. వారము చివరిలో గృహ నిర్మాణ అంశాల మీద, ముఖ్యంగా స్థిరాస్తుల విషయంలో ఖర్చులు. విదేశీ వ్యవహారాలకు సంబంధించి, సంతాన వర్గ అభివృద్ధి కొరకు, పెట్టుబడుల కొరకు, రుణములు తీసుకునే నిర్ణయాలలో ఆలస్యాలు ఆటంకాలు ఇబ్బంది కలిగిస్తాయి. విద్యాసంబంధం విషయాల మీద ఆసక్తి చూపిస్తారు. దూర ప్రదేశాలలో ఉండే స్నేహితులతో మంచి చర్చలు, నెట్వర్క్ పెంపొందించుకుంటారు. సమాచారం అందుకుంటారు. వ్యక్తిగత శ్రద్ధపెరుగుతాయి.కుటుంబ సభ్యులతో, ఉన్నతస్థాయి వ్యక్తులతో మాటల వల్ల అధిక ఘర్షణకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలతో ముందుకు వెళ్లాలి. ఆర్థిక సంబంధమైన విషయాలలో అనవసరమైన ఖర్చులను కొంతవరకు నియంత్రించడానికి ప్రయత్నం చేస్తారు

### మీన రాశి

పూర్వాభాద్ర 4వ పాదము - ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు - రేవతి

వారం ప్రారంభంలోఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. వ్యాపార భాగస్వామి వ్యవహారాలు కొంతమేర అభివృద్ధి కరంగా ఉంటాయి. స్థిరాస్తులని పెంచుకోవడానికి, రుణముల కొరకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకుంటారు. ఆత్మీయులైన మిత్రులకి, వృత్తిపరమైన విషయాలలో సహకారాన్ని ఇస్తారు. సంతాన వర్గం అభివృద్ధి వృద్ధికరంగా ఉంటుంది. వారితో కలిపి విందు వినోదాల్లో పాల్గొంటారు. గృహసౌక్యం అనుకూలం. వారాంతంలో మిత్రులు, బంధువర్గంతో కలయికలు, విద్యార్థులు కమ్యూనికేషన్ విష యంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యాపరంగా మంచి ప్రణాళికతో ఆచితూచి వ్యవహరిస్తూ ముందుకు వెళ్లాలి.వృత్తిపరంగా కొత్త వ్యక్తుల యొక్క పరిచయాలు, ప్రయాణాలు ఉంటాయి. జీవిత భాగస్వామికి వృత్తి, ఆరోగ్య సంబంధ అంశాలలో సలహా, సహకారాన్ని అందిస్తారు

నిర్వాహణ : స్వర్ణ కంకణ సన్మానిత, జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

**డా. ఈడ్పుగంటి పద్మజారాణి**

ఎమ్మెస్సీ (గణితం), ఎం.ఏ( జ్యోతిషం గోల్డ్‌మెడల్), ఎం.ఏ (ఫలిత జ్యోతిషం), పిజిడిప్లమో (జ్యోతిర్వైద్యం-గోల్డ్‌మెడల్), పిజిడిప్లమో (ఇంజనీరింగ్ వాస్తు), పిహెచ్.డి (జ్యోతిషం-గోల్డ్‌మెడల్)

9849250852 - 7506976164 - (అపాయింట్ మెంట్ ద్వారానే సంప్రదించవలెను)

